



RNI Reg NO: APTEL/2024/ 86898

# బహుజన వేదిక

తెలుగు జాతీయ దినపత్రిక




ANANTHAPURAM I KURNOOL I KADAPA I AMARAVATHI HYDERABAD I VIJAYAWADA I VISHAKAPATNAM I GUNTUR I PRAKASAM I RAJAMANDRI I TADEPALLIGUDEM I KHAMMAM I KARIMNAGAR I I NALGONDA I

సంపుటి : 2 సంచిక : 197 ఆదివారం 1 మార్చి 2026 ఎడిటర్ : పి రామాంజనేయ ప్రసాద్ వెల : 5/- పేజీలు : 8 Email : bahujanavedikaap@gmail.com

## రైతులను నాశనం చేస్తున్న భారత్, అమెరికా ఒప్పందం

- వ్యవసాయ రంగంపై భిన్నాభిప్రాయాల కారణంగా నాలుగు నెలలు నిలిచిన ఒప్పందం
- 15 నిమిషాల్లో ఎలా పూర్తయింది
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్న
- ప్రతి సంవత్సరం భారత్ రూ. 9 లక్షల కోట్ల విలువైన యూఎస్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తుంది



## 'ఇకపై హార్డ్‌వేర్ రంగంలోనూ భారత్ సత్తా'

- సెమీకండక్టర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ
- సెమీకండర్టర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ
- రూ.22,516 కోట్లతో ప్లాంట్ ఏర్పాటుచేసిన మైక్రాన్ టెక్నాలజీ?





## పశ్చిమాసియా గగనతలం మూసివేత

- అన్ని విమాన సర్వీసులు రద్దు
- ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో పశ్చిమాసియా రణరంగాన్ని తలపిస్తోంది
- భద్రతా కారణాల దృష్ట్యా పలు దేశాలు తమ గగనతలాన్ని మూసేశాయి
- ఫలితంగా మిడిల్ ఈస్ట్ గుండా వెళ్లే అన్ని విమాన సర్వీసులు రద్దయ్యాయి.

# ఘోర ప్రమాదం

**వేట్లపాలెంలో భారీ పేలుడు..23 మంది సజీవ దహనం**

**బాణసంచా పరిశ్రమలో భారీ విస్ఫోటనం..**



## వేట్లపాలెంలో విస్ఫోటనం తీవ్ర దిగ్భ్రాంతికరం

మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపిన పవన్ కల్యాణ్

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న ఉప ముఖ్యమంత్రి

పేలుళ్లకు కారణాలపై విచారణ జరుపుతున్నట్లు వెల్లడి

**అమరావతి**

కాకినాడ జిల్లాలో బాణసంచా పరిశ్రమలో పేలుడు జరిగి 21 మంది మరణించిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వేట్లపాలెం వద్ద జరిగిన ఈ పేలుడు ఘటనలో పలువురు మృతి చెందారని తెలిసి ఆవేదనకు గురయ్యానని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని ఆయన పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఈ దుర్ఘటన గురించి తెలియగానే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. కలెక్టర్, ఎస్పీ - మిగతా3లో






- 13 మందికి తీవ్ర గాయాలు
- పరిశ్రమ యజమాని పరారీ
- 5 కిమీ మేర శబ్దం, పలువురి మంత్రుల దిగ్భ్రాంతి
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు

**కాకినాడ**

కాకినాడ జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. శనివారం సామర్లకోట మండలం వేట్లపాలెంలో భారీ పేలుడు సంభవించింది. ఓ బాణాసంచా తయారీ కేంద్రంలో టపాసులు తయారు చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది దీంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో భారీగా ఎగిసి పడుతున్న మంటల్లో చిక్కుకుని 23 మంది కార్మికులు సజీవ దహనమయ్యారు. పలువురు గాయపడ్డారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. పేలుడుధాటికి మృత దేహాలు స్థానిక పంట పొలాల్లోకి ఎగిరిపడ్డాయని స్థానికులు చెబుతున్నారు.

అందిన సమాచారం మేరకు మృతుల వివరాలు : అడబాల శ్రీను, కడిపల్లి కృపమ్మ, ధనరాజు, సాధనాల సత్యవతి, వల్లూరి రవి, రాము, గంపల - మిగతా3లో



### తుది 'జాబితా' విడుదల..

## ఓటర్లలో టెన్షన్!

- బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) విడతల వారీగా ఈ జాబితాలను సేకరించి, ఆయా కేంద్రాల్లో ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచారు.
- ఈ సవరణ ప్రక్రియలో దాదాపు 60 లక్షల మంది ఓటర్ల పేర్లపై సందిగ్ధత నెలకొనడం సర్వత్రా ఆందోళన
- ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో జాబితా అప్‌లోడ్ అయ్యేలోపు క్షేత్రస్థాయిలో పారదర్శకతను పెంచేందుకే ఆఫ్‌లైన్ పద్ధతికి ప్రాధాన్యత ఇచ్చామని ఎన్నికల సంఘం స్పష్టం

### గత పాలకులు ప్రజలకే కాదు

# దేవుడికీ ద్రోహం



- పింఛనుతో పేదల జీవితాల్లో వెలుగులు
- సుపరిపాలన-- ప్రజారోగ్యానికి తొలి ప్రాధాన్యం
- కర్నూలులో స్టేట్ కాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు
- విజయనగరం జిల్లా చీపురుపల్లి ప్రజా వేదిక సభలో సీఎం చంద్రబాబు

**విజయనగరం**

గత పాలకులు తిరుమల వేంకటేశ్వర స్వామికే అపచారం తలపెట్టారు. స్వామి ప్రతిష్టను దెబ్బతీయాలని చూశారు. కెమికల్స్ తో లడ్డూ తయారు చేసి స్వామికి నైవేద్యంగా పెట్టారు. ప్రజలకే కాదు దేవుడికి కూడా ద్రోహం చేయాలని చూశారు. అలాంటి వారు రాజకీయాల్లో ఉంటే సమస్యలు వస్తాయి. దేవుడికి కూడా ద్రోహం చేసే వారికి వదిలిపెట్టకూడదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం రావి వలసలో హెచ్ పీవీ వ్యాక్సినేషన్ , పేదల సేవల కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం ప్రజా వేదిక సభకు హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కాన్సర్ నివారణకు హెచ్ పీవీ వ్యాక్సిన్ సహా అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు - మిగతా3లో



### కాంగ్రెస్ దేశ ప్రతిష్ఠను

## దిగజార్చుతోంది

- ముస్లిం లీగ్‌లా ద్వేషపూరిత రాజకీయాలు చేస్తోంది
- రాజస్థాన్ పర్యటనలో ప్రధాని మోదీ
- హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభం
- కాంగ్రెస్‌పై ఘాటు విమర్శలు
- "భారతదేశంపై ముస్లిం లీగ్‌కు ఉన్న విద్వేషమే దేశ విభజనకు కారణమైంది
- యూత్ కాంగ్రెస్ నేతలు చొక్కాలు విప్పి ఏఐ సమ్మిట్‌లో నిరసనలు వ్యక్తం చేశారు

## ఆంధ్ర యూనివర్సిటీకి పూర్వవైభవం తీసుకువస్తాం

ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలపై మంత్రి లోకేష్ సమీక్ష

ఏయూని ప్రపంచస్థాయిలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా మార్చడమే లక్ష్యం

మార్చి 26 నుంచి ఏప్రిల్ 26 వరకు పూర్వ విద్యార్థులతో వేడుకలు

యూనివర్సిటీ వందేళ్ల విజన్‌కు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశం



**అమరావతి**

చారిత్రక నేపథ్యం కలిగిన ఆంధ్ర యూనివర్సిటీకి (ఏయూ) పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా కృషి చేస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలను చరిత్రలో నిలిచిపోయేలా, కనీవినీ ఎరుగని రీతిలో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలో ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై వర్సిటీ వైస్ ఛాన్స్ లర్ (వీసీ) ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి లోకేశ్ విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆంధ్ర యూనివర్సిటీకి దశాబ్దాల ఘన చరిత్ర ఉందని గుర్తుచేశారు. ఈ యూనివర్సిటీని ప్రపంచంలోనే మేటి - మిగతా3లో

# ‘ఇకపై హార్డ్‌వేర్ రంగంలోనూ భారత్ సత్తా’

గ్లోబల్ టెక్నాలజీ వాల్యూ చైన్‌లో భారత్ వేగంగా భాగం అవుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ల వాణిజ్యంలో భారత్ కీలక పాత్ర పోషించబోతుందని మోదీ తెలిపారు. గుజరాత్‌లోని సానంద్‌లో ఏర్పాటు చేసిన మైక్రాన్ టెక్నాలజీ సెమీకండక్టర్ ప్లాంట్‌ను ప్రధాని మోదీ, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులతో కలిసి ప్లాంట్?ను సందర్శించారు. ఈ నేపథ్యంలో సెమీకండక్టర్ల విప్లవంలో భారత్ పాత్ర గురించి కీలక వ్యాఖ్యలు చేశారు.



**మూడేళ్ల కిందటే కుదిరిన మీఖ**

ఈ ప్లాంట్‌కు సంబంధించిన ఎంవోయూ మూడేళ్ల కిందటే జరిగింది. ఇందులో అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్‌కు చెందిన పనులు జరుగుతాయని మోదీ తెలిపారు. అమెరికాకు చెందిన మైక్రాన్ టెక్నాలజీ రూ. 22 వేల 516 కోట్ల భారీ పెట్టుబడితో ఈ కేంద్రాన్ని నెలకొల్పినట్టు వెల్లడించారు. ఈ ప్లాంట్‌లో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం కావడం ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ల వాణిజ్యంలో భారత్ పాత్రను బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ తెలిపారు. గత శతాబ్దాన్ని చమురు నియంత్రిస్తే ఈ శతాబ్దాన్ని సెమికండక్టర్లు నియంత్రిస్తాయని అభిప్రాయపడ్డారు.

‘10, 11 ఏళ్ల క్రితం భారత్‌లో ‘డేటా’, ‘చిప్స్’ గురించిన చర్చ కేవలం కొన్ని వర్గాలకే పరిమితమైంది. టెక్నాలజీ గురించి మాట్లాడుకున్నప్పుడు మన చర్చలు ఎక్కువగా ఐటీ సేవల చుట్టూనే తిరిగేవి. కానీ ఈరోజు చూడండి, సాఫ్ట్‌వేర్ రంగానికి పేరుగాంచిన భారత్ ఇప్పుడు ‘హార్డ్‌వేర్’ రంగంలో కూడా తన ఉనికిని చాటుకుంటూ శక్తిమంతంగా మారుతోంది. ఈరోజు సానంద్‌లో సరికొత్త భవిష్యత్తు ఆవిర్భవించడాన్ని మనం చూస్తున్నాం. మైక్రాన్ సంస్థకు చెందిన ఈ ఏటీఎంపీ ఫెసిలిటీలో వాణిజ్యపరమైన ఉత్పత్తి ప్రారంభం కావడం అనేది గ్లోబల్ టెక్నాలజీ వాల్యూ చైన్‌లో భారతదేశ పాత్రను మరింత బలోపేతం చేయనుంది. నేడు భారత్ అత్యంత వేగంగా ‘గ్లోబల్ సెమీకండక్టర్ వాల్యూ చైన్’లో అంతర్భాగమవుతోంది’ అని మోదీ తెలిపారు.

**అప్పుడు చమురు- ఇప్పుడు మైక్రోచిప్?**

అలాగే ఒకప్పుడు ప్రపంచాన్ని చమురు నియంత్రించేదని, ఇప్పుడు మైక్రోచిప్?ల కాలం నడుస్తుందని మోదీ అన్నారు. ‘ఇది ఏఐ విప్లవ శతాబ్దం. ఈ విప్లవానికి సెమీకండక్టర్ అనేది ఒక వారధిలాగా పని చేస్తుంది. ప్రపంచాన్ని గత శతాబ్దంలో చమురు నియంత్రిస్తే, ఈ శతాబ్దాన్ని సెమీకండక్టర్లు నియంత్రిస్తాయి. ఇది ఆమెరికా- భారత్ మధ్య బలమైన సహకారం, భాగస్వామ్యాన్ని కూడా సూచిస్తుంది. ఇది అత్యంత కీలకమైంది. ముఖ్యంగా ాా×, చిప్స్ రంగాలలో ఈ రెండు టెక్నాలజీలకు సరఫరా గొలుసులు భద్రపరచడానికి ప్రపంచం మొత్తం కృషి చేస్తోంది. అలాగే ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలు కూడా ఈ లక్ష్యం కోసం పనిచేస్తున్నాయి. ఏఐ సమ్మిట్ సందర్భంగా అమెరికా- భారత్ మధ్య పాక్స్ సిలికా చొరవ ఈ దిశలో మరొక అడుగు లాంటిదే. మా ఉమ్మడి ప్రయత్నాలు ప్రపంచ ముఖ్యమైన ఖనిజాల సరఫరా గొలుసును మరింత సురక్షితంగా చేస్తాయి. భారతదేశ సెమీకండక్టర్ తయారీ ప్రయాణంలో ఈ ప్రారంభోత్సవం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది’ అని మోదీ అన్నారు.

**2023లో శంకుస్థాపన!**

కాగా, 2023 సెప్టెంబర్?లో ఈ ప్లాంట్?నకు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఇండియా సెమీకండక్టర్ మిషన్?లో మొదటి ప్రతిపాదనగా ఈ ప్రాజెక్ట్?ను ఆమోదించారు. రూ. 22,500 కోట్లకు పైగా వ్యయంతో దీని నిర్మాణం జరిగింది. ఇది దేశంలో వ్యూహాత్మక సెమీకండక్టర్ పెట్టుబడులను ట్రాక్ చేయడంలో ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత దాదాపు 5 లక్షల చదరపు అడుగుల క్లీన్‌రూమ్ స్పేస్ కలిగి ఉంటుంది. దీంతో ప్రపంచంలోనే అతిపెద్ద క్లీన్‌రూమ్‌లలో ఒకటిగా ఇది మారనుంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెమరీ స్టోరేజ్, హై స్పీడ్ పెర్ఫార్మెన్స్ లాంటి సేవలు అందించేందుకు అందుబాటులోకి రానుంది.

# రైతులను నాశనం చేస్తున్న భారత్, అమెరికా ఒప్పందం

భారత్, అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం దేశ రైతులను నాశనం చేస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఏటా భారత్ రూ. 9 లక్షల కోట్ల విలువైన అమెరికా ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారని గాంధీ అన్నారు. ఈ మేరకు పంజాబ్?లో బర్నాలాలో జరిగిన మజ్దూర్ కిసాన్ మహా ర్యాలీలో పాల్గొన్న రాహుల్, పలు వ్యాఖ్యలు చేశారు.



వ్యవసాయ రంగంపై భిన్నాభిప్రాయాల కారణంగా ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయిందని ఆరోపించారు రాహుల్ గాంధీ. “పెద్ద ప్రశ్న తలెత్తుతుంది, ప్రధానమంత్రి నాలుగు నెలలుగా చేయని పని, ఆయన 15 నిమిషాల్లో ఎందుకు చేశారు?” అని ఆయన అన్నారు. వాణిజ్య ఒప్పందం అకస్మాత్తుగా ఎలా కుదిరిందని పశ్నించారు. ప్రతి సంవత్సరం భారత్ రూ. 9 లక్షల కోట్ల విలువైన యూఎస్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని మోదీ ట్రంప్‌నకు హామీ ఇచ్చారని ఆరోపించారు.

**ఆ పుస్తకం కోసం మాట్లాడాలని అనుకున్నా!**

మాజీ ఆర్మీ చీఫ్ మనోజ్ నరవణే పుస్తకంపై మాట్లాడాలని అనుకున్నానని, కానీ ఇటీవల లోక్‌సభలో మాట్లాడటానికి తనకు అనుమతి ఇవ్వలేదని రాహుల్ గాంధీ తెలిపారు. సరిహద్దు సమీపంలో చైనా దళాల కదలికల సమయంలో రాజకీయ నాయకత్వం నుంచి స్పందన లేకపోవడాన్ని ఆ పుస్తకం వివరించిందని ఆయన పేర్కొన్నారు. అయితే ఇప్పటికే పలుమార్లు రాహుల్ గాంధీ, భారత్- అమెరికా ఒప్పందంపై మాట్లాడారు. ఇటీవల అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో కేంద్ర ప్రభుత్వం రైతులకు ద్రోహం చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దీర్ఘకాలంలో భారత వ్యవసాయ రంగంపై పట్టు సాధించడానికి మరొక దేశాన్ని అనుమతిస్తున్నారా అని ప్రశ్నించారు.

**ఆధారపడేలా చేయదా?**

డ్రైడ్ డిస్టిలరీస్ గ్రెయిన్స్‌ను దిగుమతి చేసుకోవడం అంటే జన్యుమార్పిడి చేసిన అమెరికా మొక్కజొన్నను పాడి ఉత్పత్తిదారులకు అందించడమేనని రాహుల్? ఎక్స్?లో రాసుకొచ్చారు. ఇది దేశ పాల ఉత్పత్తులను అమెరికా వ్యవసాయ పరిశ్రమపై ఆధారపడేలా చేయదా అని ప్రశ్నించారు. సోయా నూనె దిగుమతికి అనుమతిస్తే, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ సహా దేశవ్యాప్తంగా ఉన్న సోయా రైతులపై ప్రభావం ఉండదా అని నిలదీశారు.

అదనపు ఉత్పత్తులు అంటే పప్పుధాన్యాలు సహా ఇతర పంటలను దిగుమతులకు భారత మార్కెట్‌ను తెరవాలనే ఒత్తిడిని సూచిస్తోందని రాహుల్ తెలిపారు. వాణిజ్యయేతర అడ్డంకులను తొలగిస్తామంటే భవిష్యత్తులో జన్యుమార్పిడి పంటలపై భారత్ తన వైఖరిని మార్చుకుంటుందా అని ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రభుత్వం రైతులకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడేలా!**

ఆ తర్వాత అమెరికాతో మోదీ సర్కార్ చేసుకున్న ఒప్పందం కారణంగా దేశంలో వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆరోపించారు. అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకుంటేనే, భారత వస్త్ర పరిశ్రమకు సుంకాల మినహాయింపు ఉంటుందనే విషయాన్ని ఎందుకు దాచారని ఆయన ప్రశ్నించారు. బంగ్లాదేశ్ కూడా భారత్ నుంచి పత్తి దిగుమతులను నిలిపివేసే సంకేతాలు ఇస్తోందని, తద్వారా రైతులకు నష్టం జరుగుతుందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దూరదృష్టి గల ప్రభుత్వం అయితే పత్తి రైతులు, టెక్స్‌టైల్ ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడేలా ఒప్పందం చేసుకునేదని రాహుల్ అన్నారు.

ఒకవేళ మోదీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల కోసం ఆలోచించి ఉంటే పత్తి రైతులు, వస్త్ర ఎగుమతిదారుల శ్రేయస్సును రక్షించే విధంగా చర్చలు జరిపి ఉండేదని రాహుల్? గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ, ఆయన ప్రభుత్వం కలిసి రెండు రంగాలకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారని ? ఆరోపించారు. ఈ ఒప్పందం కారణంగా పత్తి, వస్త్ర పరిశ్రమ రంగాలపై ఆధారపడి ఉన్న కోట్లాది మంది భారతీయుల కుటుంబాలను నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం అనే గొయ్యిలోకి నెట్టివేశారని రాహుల్? గాంధీ విమర్శించారు.

# కాంగ్రెస్ దేశ ప్రతిష్ఠను దిగజార్చుతోంది

ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ చొక్కాలు విప్పి చేపట్టిన నిరసనలపై ప్రధాని నరేంద్ర మోదీ శనివారం మండిపడ్డారు. కాంగ్రెస్ ఇప్పుడు ‘ముస్లిం లీగ్?-మావోయిస్ట్ కాంగ్రెస్’గా మారిందని, దేశప్రతిష్ఠను దిగజార్చేందుకు ఎక్కడ వీలైతే అక్కడ చొరబడేందుకు ప్రయత్నిస్తోందని ఆయన విమర్శిం చారు. రాజస్థాన్‌లోని అజ్మీర్ కాయద్ విశ్రామ్ స్థల్?లో జరిగిన ర్యాలీలో మాట్లాడిన ఆయన కాంగ్రెస్?పై విరుచుకుపడ్డారు.



“భారతదేశంపై ముస్లిం లీగ్‌కు ఉన్న విద్వేషమే దేశ విభజనకు కారణమైంది. నేడు కాంగ్రెస్ కూడా అదే రీతిలో వ్యవహరిస్తోంది. యూత్ కాంగ్రెస్ నేతలు చొక్కాలు విప్పి ఏఐ సమ్మిట్‌లో నిరసనలు వ్యక్తం చేశారు. వాస్తవానికి వాళ్లు విదేశీ ప్రతినిధుల ముందు భారతదేశాన్ని అవమానించడానికి నాటకాలు ఆడారు. ఏఐ సమ్మిట్?ను చూసి దేశ ప్రజలు గర్వపడుతూ ఉంటే, కాంగ్రెస్ మాత్రం విదేశీ అతిథుల ముందు దేశాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నించింది. కాంగ్రెస్? దేశవ్యాప్తంగా వరుసగా ఎన్నికల్లో ఓడిపోతోంది. ఆ కోపంతోనే దేశ ప్రతిష్టను దెబ్బతీస్తూ ప్రతీకారం తీర్చుకుంటోంది. ఒకప్పుడు కాంగ్రెస్? ఐఎన్?సీ (ఇండియన్ నేషనల్? కాంగ్రెస్?)గా ప్రసిద్ధి చెందింది. కానీ నేడు ఐఎన్?సీ లేదు. అది ఎంఎంసీ (ముస్లింలీగ్?- మావోయిస్టు కాంగ్రెస్?)గా మారింది.”

మరోవైపు ‘మావోయిస్టులు కూడా భారతదేశ శ్రేయస్సును, మన రాజ్యాంగాన్ని, మన విజయవంతమైన ప్రజాస్వామ్యాన్ని చూసి అసూయ పడతారు. వారు మనపై దాడులు చేస్తారు. అదే విధంగా కాంగ్రెస్ కూడా దేశాన్ని కించపరిచేందుకు, అప్రతిష్ఠపాలు చేసేందుకు ఎక్కడికైనా చొరబడుతుంది’ అని మోదీ విమర్శించారు. కాంగ్రెస్ చేసిన తప్పులను దేశం ఎన్నటికీ క్షమించదని, దేశాన్ని అప్రతిష్ఠపాలు చేయడం, సాయుధ దళాలను బలహీనపరచడం ప్రతిపక్ష పార్టీకి పాత అలవాటేనని ప్రధాని అన్నారు. ‘మన సాయుధ దళాలు తమ పరాక్రమంతో ప్రపంచ గుర్తింపు పొందాయి. కానీ కాంగ్రెస్ నేతలు, మన ప్రత్యర్థుల తప్పుడు ప్రచారాలనే పదేపదే వినిపించారు. దేశానికి ఏది మంచిదో, దేశానికి, పౌరులకు ఏది ప్రయోజనకరమో కాంగ్రెస్ వాటన్నింటినీ వ్యతిరేకిస్తుంది. అందుకే ఈ రోజు దేశం కాంగ్రెస్?కు తగిన బుద్ధి చెబుతోంది’ అని మోదీ పేర్కొన్నారు.

**లీకేజీలకు చెక్?**

రాజస్థాన్‌లో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నప్పుడు పేపర్ లీకేలు యువత భవిష్యత్తును అంధకారం చేశాయని, ప్రస్తుత బీజేపీ సర్కార్ వాటికి అడ్డుకట్ట వేసిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుమారు 21వేల మంది యువతకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన ఆయన, “గతంలో పేపర్ లీకేజీ వార్తలు వినేవాళ్లం. ఇప్పుడు నియామక పత్రాల పంపిణీ చూస్తున్నాం” అన్నారు.

**ఆడబిడ్డల కోసం**

ఇక మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, దేశవ్యాప్తంగా గర్భాశయ క్యాన్సర్? నివారణ కోసం హెచ్?పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని అజ్మీర్?లో ప్రధాని మోదీ ప్రారంభించారు. 14 ఏళ్ల వయస్సున్న బాలికలకు ఈ టీకాలను ఉచితంగా అందించే కార్యక్రమం 1.15 కోట్ల మందికి లబ్ధి చేకూరనుందని ఆయన చెప్పారు. రాజస్థాన్?లో రూ.16,680 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేసిన ఆయన, నేడు ఆ రాష్ట్రం వేగవంతమైన అభివృద్ధితో దూసుకుపోతోందని అన్నారు. కాగా, మార్కెట్‌లో వేల రూపాయల ఖరీదు చేసే ఈ వ్యాక్సిన్?ను, ప్రభుత్వం నేడు ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో, (ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు), సబ్-డిస్ట్రిక్ట్, జిల్లా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు) అలాగే ప్రభుత్వ వైద్య కళాశాల్లో ఈ టీకా ఉచితంగా అందుబాటులో ఉంటుంది. తల్లిదండ్రులు లేదా సంరక్షకుల నుంచి ‘ఇన్ఫార్మ్డ్ కన్సెంట్’ తీసుకున్న తర్వాతే ఈ వ్యాక్సినేషన్? టీకా ఇవ్వనున్నారు.

## హాస్టల్‌లో అసభ్యకర ప్రవర్తన.. విద్యార్థినిని బహిష్కరించిన యూనివర్సిటీ

**భోపాల్:** యూనివర్సిటీలో చదువుతున్న ఒక విద్యార్థిని హాస్టల్‌లో అసభ్యకరంగా, అభ్యంతరకరంగా ప్రవర్తించింది. దీంతో తోటి లేడీ స్టూడెంట్స్ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ హాస్టల్ నుంచి ఆ యువతిని బహిష్కరించారు. (బఅఅజవతీంఅ వఞజూవశ్రీం టవమ్ఖిశ్రీవ ర్‌బఎవత్) మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ సంఘటన జరిగింది. దేవి అహల్య విశ్వవిద్యాలయంలో ఒక యువతి మొదటి సంవత్సరం చదువుతున్నది. క్యాంపస్‌లోని హాస్టల్‌లో నివసిస్తున్న ఆమె అనుచితంగా ప్రవర్తిస్తున్నది. మగవారితో వీడియో కాల్స్ మాట్లాడుతూ అసభ్యకర చేష్టలు చేస్తున్నది. అలాగే మొబైల్ అప్లికేషన్ ద్వారా తెలియని పురుషులతో స్నేహం చేసి మాట్లాడాలని లేడీ స్టూడెంట్స్‌ను ప్రోత్సహిస్తున్నది. కాగా, ఆ విద్యార్థినిపై పలు ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చాయి. దీంతో దర్యాప్తు కోసం అంతర్గత విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ యువతి గదిలో హాస్టల్ వార్డెన్ సోదా చేశారు. అభ్యంతరకరమైన వస్తువులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఆ విద్యార్థిని వల్ల హాస్టల్‌లోని ఇతర విద్యార్థినులకు తీవ్రమైన సమస్యలు తలెత్తవచ్చని దేవి అహల్య యూనివర్సిటీ యాజమాన్యం భావించింది. ఈ నేపథ్యంలో ఆ యువతిని వెంటనే హాస్టల్ నుంచి బహిష్కరించినట్లు వైస్ ఛాన్సలర్ రాకేష్ సింఘై తెలిపారు.




## పశ్చిమాసియా గగనతలం మూసివేత



ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. ఇరాన్?పై అమెరికా, ఇజ్రాయెల్ దళాలు మిస్సైళ్లతో విరుచుకపడుతున్నాయి. మరోవైపు అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ రాకెట్ల వర్షం కురిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రాంతంలో విమాన సర్వీసులు పూర్తిగా స్తంభించిపోయాయి. భద్రతా కారణాల దృష్ట్యా భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, దుబాయ్, టర్కీ సహా పలు దేశాలు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే దుబాయ్, దోహా వంటి అంతర్జాతీయ విమాన విమానాశ్రయాల్లోనే భారీ సంఖ్యలో ప్రయాణికులు చిక్కుకుపోయారు.

**భారతీయ విమానయాన సంస్థలపై ప్రభావం**

ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ పరస్పర దాడుల ప్రభావం భారతీయ విమానయాన సంస్థలపై పడింది. మధ్యప్రాచ్య దేశాలకు నడిచే అన్ని సర్వీసులను శనివారం అర్ధరాత్రి వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఇండిగో ప్రకటించింది. “ఇరాన్, మధ్యప్రాచ్య గగనతలంలో విధిస్తున్న ఆంక్షల నేపథ్యంలో అటువేపు వెళ్లే, వచ్చే అన్ని విమానాలను రద్దు చేస్తున్నాం” అని ఇండిగో ట్వీట్ చేసింది. దీంతో దుబాయ్, జెడ్డా, దోహా, అబుదాబి, దమ్మామ్, బహ్రెయిన్, షార్జా, కువైట్, రస్ అల్-ఖైమా నగరాలకు సర్వీసులు నిలిచిపోయాయి. ప్రయాణికులు, సిబ్బంది భద్రతకే తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఇండిగో స్పష్టం చేసింది. మరోవైపు, గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల దృష్ట్యా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ పశ్చిమాసియా వెళ్లే అన్ని అంతర్జాతీయ విమానాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అనంతరం ఎయిర్ ఇండియా కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసింది. మధ్యప్రాచ్యంలోని అన్ని గమ్యస్థానాలకు విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. ప్రయాణికులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తామని సంస్థ హామీ ఇచ్చింది. ఢిల్లీ నుంచి ఇజ్రాయెల్ (టెల్ అవీవ్) వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం (ాా×139) గాలిలో ఉండగానే భద్రతా కారణాల దృష్ట్యా వెనక్కి మళ్లింది. దీన్ని ముంబైలో సురక్షితంగా పైలెట్లు ల్యాడ్ చేశారు. బోయింగ్ 777 విమానం గాలిలో సుమారు ఐదు గంటల పాటు ప్రయాణించింది. సౌదీ అరేబియా గగనతలంలో ఉన్న సమయంలో, ఇజ్రాయెల్ ఎయిర్‌స్పేస్ మూతపడటంతో పైలట్లు విమానాన్ని వెనక్కి మళ్లించారు. దీనివల్ల ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి ఎయిర్ ఇండియా విచారం వ్యక్తం చేసింది. గగనతలాల మూసివేత కారణంగా అనేక అంతర్జాతీయ విమానయాన సంస్థలు, విమానాలపై తీవ్ర ప్రభావం పడుతోందని ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ కూడా వెల్లడించింది.

**విదేశీ సర్వీసులు**

ఖతార్ ఎయిర్‌వేస్ తమ గగనతలం మూసివేత వల్ల దోహాకు రావాల్సిన, అక్కడి నుంచి వెళ్లాల్సిన అన్ని విమానాలను తాత్కాలికంగా రద్దు చేసింది. దుబాయ్ కేంద్రంగా నడిచే పలు సర్వీసులు నిలిచిపోయాయని, ప్రయాణికులు తమ విమాన స్థితిని ఆన్‌లైన్‌లో తనిఖీ చేసుకోవాలని ఎమిరేట్స్ సూచించింది. లెబనాన్, సిరియా, ఇరాక్, ఇరాన్,జోర్డాన్ దేశాలకు సోమవారం వరకు విమానాలను నిలిపివేసినట్లు టర్కిష్ ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. లండన్ నుంచి దుబాయ్‌కి వెళ్లే విమానాలను వర్జిన్ అట్లాంటిక్ ఎయిర్?లైన్స్ రద్దు చేసింది. ఇరాక్ మీదుగా వెళ్లే మార్గాన్ని మళ్లించడం వల్ల భారత్, మాల్దీవులు, రియాద్, దుబాయ్ వెళ్లే విమాన ప్రయాణ సమయం మరింత పెరుగుతుందని తెలిపింది. అత్యవసర పరిస్థితుల్లో దారి మళ్లించడానికి వీలుగా విమానాల్లో అదనపు ఇంధనాన్ని నింపుతున్నట్లు పేర్కొంది. డచ్ విమానయాన సంస్థ కేఎల్‌ఎం ఆదివారం నుంచి టెల్ అవీవ్‌కు విమానాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. యుద్ధ వల్ల వేలమంది ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు. కొన్ని విమానయాన సంస్థలు విమాన మార్గాలను మళ్లించడం వల్ల ఇంధన ఖర్చులు పెరగడంతో పాటు, ప్రయాణ సమయం కూడా భారీగా పెరిగే అవకాశం ఉంది. ఇదే సమయంలో రానున్న రోజుల్లో మరిన్ని విమాన సంస్థలు సర్వీసులను నిలిపివేసే అవకాశం ఉంది. దీంతో ప్రయాణికుల కష్టాలు మరింత పెరగనున్నాయి

## తుది ‘జాబితా’ విడుదల.. ఓటర్లలో టెన్షన్!

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగనున్న తరుణంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ముగింపు దశకు చేరింది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సమగ్ర ఓటర్ల జాబితా సవరణ(ఎస్ఐఆర్)లోని తుది ఓటర్ల జాబితా శనివారం అందుబాటులోకి వచ్చింది. ఈ జాబితాను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడానికంటే ముందే నేరుగా పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించడంతో రాష్ట్రవ్యాప్తంగా ఒక్కసారిగా కలకలం చెలరేగింది. తమ పేర్లు జాబితాలో ఉన్నాయో లేదో సరిచూసుకునేందుకు ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాల వద్దకు తరలివస్తుండటంతో అన్ని జిల్లాల్లోనూ కోలాహలం నెలకొంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజాము నుంచే ఓటర్ల జాబితా హార్డ్ కాపీలను జిల్లా మేజిస్ట్రేట్లు, బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లకు చేరవేశారు. అక్కడి నుంచి బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) విడతల వారీగా ఈ జాబితాలను సేకరించి, ఆయా కేంద్రాల్లో ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా ఈ సవరణ ప్రక్రియలో దాదాపు 60 లక్షల మంది ఓటర్ల పేర్లపై సందిగ్ధత నెలకొనడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న ఈ ప్రక్రియలో భాగంగా ఈ పేర్లను ‘పరిశీలన’ విభాగంలో ఉంచారు. తాజాగా విడుదలైన తుది జాబితాలో వారిలో ఎంతమంది పేర్లు మనుగడలో ఉన్నాయి? ఇంకెంతమంది పేర్లు తొలగించారనే అంశం ఇప్పుడు రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో జాబితా అప్‌లోడ్ అయ్యేలోపు క్షేత్రస్థాయిలో పారదర్శకతను పెంచేందుకే ఆఫ్‌లైన్ పద్ధతికి ప్రాధాన్యత ఇచ్చామని ఎన్నికల సంఘం స్పష్టం చేసినప్పటికీ, ఓటర్లలో నెలకొన్న ఉత్కంఠ కారణంగా పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరుతున్నారు. తమ ఓటు హక్కు సురక్షితంగా ఉందో లేదోనన్న ఆందోళన ఓటర్లలో వ్యక్తమవుతోంది. మరోవైపు ఈ పరిణామం బెంగాల్ రాజకీయ వర్గాల్లో సెగలు పుట్టిస్తోంది. తుది జాబితా వెలువడటంతో అటు అధికార, ఇటు ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు అప్రమత్తమయ్యారు. ప్రతి నియోజకవర్గంలోనూ బూత్‌ల వారీగా డేటాను విశ్లేషించేందుకు పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయికి చేరుకున్నారు. ఓట్ల తొలగింపుపై అప్పుడే ఆరోపణలు, ప్రత్యారోపణలు మొదలయ్యాయి. స్వల్ప మార్పులు కూడా గెలుపోటములను శాసించే అవకాశం ఉండటంతో, తమ పార్టీ మద్దతుదారులైన ఓటర్ల పేర్లను నిర్ధారించుకునే పనిలో పడ్డారు. ఎన్నికల సంఘం మాత్రం పారదర్శకతే తమ ప్రథమ కర్తవ్యమని పునరుద్ఘాటించింది. అర్హులైన ఓటర్ల పేర్లు ఎవరివైనా జాబితాలో లేకపోయినా లేదా ఏవైనా తప్పులున్నా తక్షణమే ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని ఆశ్రయించవచ్చని అధికారులు సూచించారు.



# మండలిలో మంటలు

**విజయవాడ**

ఏపీలో మండలి సమావేశాలు ఇంట్రెస్టింగ్‌గా నడుస్తున్నాయి. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అయినా..ఇప్పుడు కూటమి పవర్‌లో ఉండగా..మండలిలో మాత్రమే చర్చ జరుగుతుండటం ఆసక్తికరంగా మారింది. 2020లో మండలిలో టీడీపీ బలంగా ఉండేది. అప్పుడు అసెంబ్లీలో వైసీపీకి 151 సీట్లు ఉండటంతో వార్ వన్ సైడ్ అన్నట్లుగా సమావేశాలు నడిచాయి. టీడీపీ సభకు వెళ్లినా గొడవ జరగడం, వాకౌట్‌లు అంటూ నిరసన వ్యక్తం చేయడం నడిచేవి. దీంతో సంఖ్యాపరంగా అప్పుడు వైసీపీ అసెంబ్లీలో బలంగా ఉండటంతో వారిదే అప్పర్ హ్యాండ్‌గా ఉండేది.అదే సమయంలో మండలిలో మాత్రం అప్పుడు టీడీపీ బలంగా ఉంటూ పోరాడుతూ వచ్చింది. అప్పుడు టీడీపీకి మండలిలో ఎమ్మెల్సీల బలం ఉండటంతో పాటు ఛైర్మన్ కూడా ఆ పార్టీ నియమించిన వ్యక్తి ఉండటంతో..పెద్దల సభలో వైసీపీ దూకుడును అడ్డుకోగలిగింది. అమరావతి బిల్లును వైసీపీ ప్రభుత్వం అసెంబ్లీలో పాస్ చేసినా..మండలికి వచ్చేసరికి టీడీపీ బ్రేకులు వేయడంతో ఆగిపోయింది. దీంతో ఒకానొక సమయంలో అప్పటి వైసీపీ సర్కార్ మండలిని రద్దు చేసే ఆలోచన కూడా చేసింది.ఇప్పుడు సీన్ మారింది. సీట్లు కూడా మారాయి. విపక్షంలో ఉన్న వైసీపీ అసెంబ్లీకి వెళ్లడం లేదు. మండలిలో మాత్రం తమకున్న బలంతో స్ట్రాంగ్ వాయిస్ వినిపించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో అసెంబ్లీలో 164 సీట్లతో బలంగా ఉన్న కూటమి అక్కడ తమ వాయిస్‌ను వినిపిస్తూ, వైసీపీ తప్పులను ఎత్తిచూపుతోంది. మండలిలో వైసీపీ బలంగా ఉండటంతో..కూటమి సర్కార్ ఏం చేసినా అడ్డుకుంటుండంతో కూటమికి అక్కడ సవాల్‌గా మారింది. కల్తీ నెయ్యిపై చర్చ సందర్భంగా..రచ్చ రచ్చ అయింది. కల్తీ నెయ్యి అంశంపై షార్ట్ డిస్కషన్‌కు ఛైర్మన్ మోషేన్ రాజు అనుమతించారు. వైసీపీ సభ్యుడు పి.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడేందుకు అవకాశమిచ్చారు. అయితే స్వల్పకాలిక చర్చ కోసం వైసీపీ నోటీసు ఇవ్వకపోయినా..ఆ పార్టీ సభ్యుడికి మాట్లాడే అవకాశమిచ్చారంటూ టీడీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిందిసేమ్‌టైమ్ దేవాదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి కల్తీ నెయ్యి అంశంపై ప్రకటన చేసేందుకు లేచి నిలబడ్డారు. అయినా మండలి ఛైర్మన్..వైసీపీ సభ్యుడికే లఘు చర్చను ప్రారంభించే అవకాశం ఇచ్చారంటూ టీడీపీ మరోసారి అబ్జక్షన్స్ వ్యక్తం చేసింది. ఈ సమయంలో మంత్రి పయ్యావుల కేశవ్, మండలి ఛైర్మన్ మోషేన్ రాజు మధ్య తీవ్ర వాదనలు జరిగాయి. వైసీపీ ఇవ్వని నోటీసును ఇచ్చినట్లుగా భావించి లఘు చర్చకు అనుమతించడమే కాకుండా, ప్రభుత్వం తరపున ప్రకటనకు నిరాకరించడం సరైంది కాదంటూ..టీడీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వాదోపవాదాలు, అధికార-విపక్ష సభ్యుల ఆందోళనలతో మండలిలో గందరగోళం ఏర్పడింది. చర్చ జరగకుండానే సభ వాయిదా పడింది.అయితే ఇప్పుడు మండలిలో వైసీపీకి మెజార్టీ ఉంది. పైగా మండలి ఛైర్మన్ మోషేన్ రాజు కూడా వైసీపీ హయాంలో నియమించబడ్డారు. దీంతో పెద్దల సభలో ఆ పార్టీ అప్పర్ హ్యాండ్ సాధించే ప్రయత్నం చేస్తుందన్న చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే షార్ట్ డిస్కషన్‌పై నిబంధనలు పక్కన పెట్టి మండలి ఛైర్మన్ వ్యవహరించారని టీడీపీ ఆరోపిస్తుంది. మోషేన్ రాజు మాత్రం..అధికార పక్షం అలిగేషన్స్‌ను తప్పుబడుతున్నారు. నోటీస్ విషయంలో పక్కదారి పట్టించేలా మాట్లాడటం సరికాదంటున్నారు. దీంతో మండలిలో కూటమి వర్సెస్ వైసీపీ ఫైట్ ఆసక్తికరంగా మారింది.మరోవైపు మండలిలో అప్పర్ హ్యాండ్ సాధించేందుకు కూటమి ప్లాన్స్ చేస్తుంది. ఇప్పటికే ఆరుగురు వైసీపీ ఎమ్మెల్సీలు కూటమి పార్టీల్లో చేరారు. ఇందులో ఐదుగురు రాజీనామా చేయగా..స్పీకర్ వారికి నోటీసులు ఇచ్చి వివరణ తీసుకుంటున్నారు. ఈ ఐదుగురి రాజీనామాలను మండలి ఛైర్మన్ ఆమోదిస్తే..ఆ సీట్లు కూటమి ఖాతాలోకి వెళ్లనున్నాయి. అప్పుడు మండలిలో కూటమి బలం పెరగనుంది. తర్వాత మరికొంతమంది వైసీపీ ఎమ్మెల్సీలను కూడా ఫ్యాన్ స్విచ్చాఫ్ చేసి కూటమి గూటికి చేరేందుకు రెడీగా ఉన్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. సేమ్‌టైమ్ కొందరు ఎమ్మెల్సీల పదవీకాలం కూడా ముగియనుంది. ఈ సీట్లు కూడా కూటమినే కైవసం చేసుకోనుంది. ఏదైనా మండలిలో జరుగుతున్న ఫైట్..పొలిటికల్ హాట్ టాపిక్‌గా..పబ్లిక్ అటెన్షన్‌ను గ్రాబ్ చేసేలా ఉందనడంలో డౌటే లేదు.




# ప్రకాశంలో ఐరన్ ఓర్ నిల్వలు

**ఒంగోలు :** ఏపీలోని ప్రకాశం జిల్లాలో ఇనుప ఖనిజం నిల్వలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. మాగ్నటైట్ నిల్వలు ఉన్నట్లు ప్రాథమికంగా తేలటంతో.. జియోలాజికల్ టీమ్స్ రంగంలోకి దిగాయి. మాగ్నటైట్ నిల్వలు ఎంతమేరకు ఉన్నాయనే దానిపై డ్రిల్లింగ్ పనులు చేపట్టాయి. ప్రాథమిక అంచనా మేరకు ప్రకాశం జిల్లాలో భారీగా ఇనుప ఖనిజం నిల్వలు ఉన్నట్లు తేలితే.. ఏపీ మైనింగ్ రంగానికి ఓ బిగ్ బూస్ట్ కానుందని అధికారులు చెప్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో ఇనుప ఖనిజం నిక్షేపాలు ఉన్నట్లు ప్రాథమిక అధ్యయనాలు వెల్లడించాయి. భూ ఉపరితలం కిందిభాగంలో మాగ్నటైట్ నిల్వలు గణనీయమైన స్థాయిలో ఉన్నట్లు ప్రాథమిక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మాగ్నటైట్ ఖనిజం పరిధి, లోతు, నాణ్యతను అంచనా వేయడానికి జియోలాజికల్ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించాయి. ప్రకాశం జిల్లాలోని ఎంపిక చేసిన మండలాల్లో డ్రిల్లింగ్ కార్యకలాపాలను నిర్వహించాయి. ప్రకాశం జిల్లాలో సేకరించిన మాగ్నెటైట్ నమూనాలలో ఇనుము 18 నుంచి 25 శాతం వరకు ఉందని నిపుణులు తెలిపారు. సాధారణంగా దీనిని లోగ్రేడ్ ఐరన్ ఓర్‌గా పిలుస్తుంటారు. అయితే ప్రాసెసింగ్ చేసిన తర్వాత పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడుతుందని నిపుణులు చెప్తున్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం ప్రకాశం జిల్లాలో సుమారుగా 800 మిలియన్ టన్నుల మాగ్నటైట్ నిల్వలు ఉన్నట్లు అంచనా.అయితే ఎంత మొత్తంలో మాగ్నటైట్ నిల్వలు ఉన్నాయి, వాణిజ్య పరమైన ఉపయోగాలు వంటి అంశాలపై మరింత స్పష్టత కోసం జియోలాజికల్ మ్యాపింగ్, ఫీజబులిటీ అధ్యయనాలు జరుగుతున్నాయి. ప్రాథమిక అంచనాలు నిజమై ప్రకాశం జిల్లాలో గణనీయమైన స్థాయిలో మాగ్నటైట్ నిల్వలు ఉన్నట్లు తేలితే ప్రకాశం జిల్లా ఏపీ ఖనిజ రంగానికి గణనీయమైన సహాయకారిగా మారుతుందని అధికారులు చెప్తున్నారు. మరోవైపు మాగ్నటైట్ అన్వేషణ కోసం ప్రైవేట్ ఉక్కు దిగ్గజం ఏూచి స్టీల్ బిడ్ గెలుచుకుంది.



పైలట్ స్టడీ కింద ఈ ప్రక్రియను వేగవంతం చేసింది. మరోవైపు ఖనిజాలను ముడి పదార్థం రూపంలో ఎగుమతి చేయబోమని అధికారులు చెప్తున్నారు.ధాతువును శుద్ధి చేయడానికి, మలినాలను తొలగించడానికి, ఇనుము శాతాన్ని పెంచడంతో పాటుగా లోగ్రేడ్ మాగ్నటైట్‌ను ఉక్కు తయారీకి అనువైన హైగ్రేడ్ పదార్థంగా మార్చడానికి జిల్లాలో బెనిఫిషియేషన్ ప్లాంట్ ప్రతిపాదించినట్లు తెలిపారు. దీనివలన ఆర్థికపరమైన కార్యకలాపాలు పెరగటంతో పాటుగా స్థానిక యువతకు ఉపాధి కలుగుతుందని అధికారులు చెప్తున్నారు.మరోవైపు ఈ ప్రాజెక్ట్ అమలులోకి వచ్చిన తర్వాత రవాణా, ప్రాసెసింగ్ సౌకర్యాలతో సహా మౌలిక సదుపాయాల అభివృద్ధి ఊపందుకుంటుందని వెల్లడించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ఇంకా ఖనిజాన్ని కనుగొనే దశలోనే ఉందని.. మైనింగ్‌కు ముందు అనుమతులు, పర్యావరణ అధ్యయనాలు, ప్రజా సంప్రదింపులు ఉంటాయని అధికారులు వెల్లడించారు


## వేట్లపాలెంలో విస్ఫోటనం తీవ్ర దిగ్భ్రాంతికరం

-మొదటిపేజీ తరువాయి

ఘటన స్థలంలో ఉండి పరిస్థితిని, సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ, క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బాణాసంచా తయారీ పరిశ్రమ వద్ద ఇంకా పేలుళ్లు చోటుచేసుకుంటున్నట్టు అధికారులు తెలియజేశారని, పేలుళ్లకు కారణాలపై విచారణ ప్రారంభించినట్లు తెలిపారు. బాణాసంచా పరిశ్రమలపై అధికారులు ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని, భద్రత చర్యలను తనిఖీ చేయాలని జిల్లా అధికారులకు ఆదేశించినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. పరిసర గ్రామాలకు పొగ అలుముకున్న క్రమంలో ఆయా గ్రామాల ప్రజలకి ధైర్యం చెప్పి, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సహాయక చర్యల పర్యవేక్షణ కోసం, బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పడానికి మంత్రి కందుల దుర్గేశ్, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లను ఘటనాస్థలానికి పంపించినట్లు తెలిపారు.

# మార్చి 1 నుంచి మండే ఎండలు

**విశాఖపట్టణం :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి. అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో మూడ్రోజుల నుంచి పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షాలు కురుస్తున్నాయి. దక్షిణ అంతర్గత కర్ణాటక ప్రాంతం నుంచి మహారాష్ట్రలోని మార్వాడా వరకు వ్యాపించి ఉన్న ద్రోణి వాయువ్య దిశగా కదులుతుంది. దీని ప్రభావంతో శుక్రవారం సంగారెడ్డి, రంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీంతో ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్జ్ జారీ చేసింది. ణి ప్రభావంతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉండి, కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో 4.36 సెంటీమీటర్ల మేర అత్యధిక వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లా గూడూరులో అత్యల్పంగా 1.38 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక సిద్దిపేట, వికారాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, జయశంకర్ భూపాలపల్లి వంటి పలు జిల్లాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఈ అకాల వర్షాలకు రైతులు దారుణంగా నష్టపోతున్నారు. పలు జిల్లాల్లో మొక్కజొన్న, శనగ, జొన్న పంటలు నేలకొరిగాయి. గింజ పాలు పోసుకునే దశలో మొక్కజొన్న నేలవాలడంతో ఎదుగుదల కష్టమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెబుతున్నారు. పలు ప్రాంతాల్లో శుద్ధి చేసి ఆరబెట్టిన పసుపు గాలివానకు తడిసిపోయింది. శనివారం నుంచి వాతావరణం సాధారణ స్థితికి చేరుకునే అవకాశం ఉంది. ఉక్కపోతలు కూడా రేపట్నుంచి మొదలవుతాయని వాతావరణ కేంద్రం వివరించింది. ప్రస్తుతం రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 33 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 21గా నమోదవుతున్నాయి. మార్చి 1 నుంచి ఎండలు మండిపోతాయని జనాలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.



## ఘోర ప్రమాదం

-మొదటిపేజీ తరువాయి

మంగ, గోదత మహేష్, మందపల్లి చిన్ని, నిమ్మడ కరుణ, గొట్ట మహేష్, రమణ, నానిలు ఉన్నారు.

**డీఎన్ఏ టెస్టుల ఆధారంగా మృతదేహాల అప్పగింత**

డీఎన్ఏ టెస్టుల ఆధారంగా మృతదేహాలను అప్పగించే పనిలో పడ్డారు అధికారులు. డీఎన్ఏ రిపోర్టులు వచ్చిన తర్వాత మృతదేహాలను అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారు.

**కాకినాడ జిల్లాలో భారీ పేలుడు.. మంటల్లో 50 మంది..!**

ప్రమాదం సమయంలో 70 మంది కార్మికులు ఉన్నట్టు సమాచారం. పేలుడు ధాటికి చుట్టు పక్కల ఇళ్లు ధ్వంసమయ్యాయి. దట్టమైన పొగలు అలుముకున్నాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది, ఇతర సహాయక బృందాలు సహాయక చర్యల్ని చేపట్టాయి. ఘటనా స్థలంలో బాధిత కుటుంబాల ఆర్తనాదాలు మిన్నంటాయి.

**గతంలో భారీ పేలుళ్లు, విషాదాలు**

బాణసంచా తయారీ సందర్భాల్లో అనేక ప్రమాదాలు జిల్లాలో చోటు చేసుకున్నాయి. బాణా సంచా తయారీకి ప్రసిద్ధి చెందిన వేట్లపాలెం, పరిసర గ్రామాల్లో ఇలాంటి భారీ ప్రమాదాలు జరగడం, పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటు చేసుకున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని వేట్లపాలెం, జువ్విపాడు, ద్రాక్షారామ, వేళంగి, రాయవరం, వి.సావరం, కొమరిపాలెం, బిక్కవోలు, మండపేట తదితర ప్రాంతాల్లో తయారీ కేంద్రాలున్నాయి. ఏడాది పొడవునా ఇక్కడి వ్యాపారులకు చేతినిండా పని ఉంటుంది. బాణసంచా తయారీ కోసం ఫారమ్ 20, కేవలం అమ్మకం కోసం ఫారమ్ 24 జారీ చేస్తారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 50కి పైగా లైసెన్స్‌డ్ తయారీ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలోని మండపేట, జువ్విపాడు, ద్రాక్షారామం, కొమరిపాలెం, రాయవరం, బిక్కవోలు, యు.కొత్తపల్లి మండలం వాకతిప్ప తదితర చోట్ల బాణసంచా కేంద్రాల్లో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అయితే వాకతిప్పలో 2014 అక్టోబర్ 22వ తేదీన చోటు చేసుకున్న ఘటన ప్రమాదంలో 18 మంది మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాద ఘటన అనేక లోపాలను ఎత్తిచూపింది. కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం విలస గ్రామంలో కిరాణా షాపులో బాణసంచా పేలి భార్యాభర్తలు కంచర్ల శ్రీనివాసరావు, సీతామహాలక్ష్మి మృతిచెందారు. అలాగే గత ఏడాది రాయవరంలోని శ్రీ గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో జరిగిన భారీ పేలుడులో నలుగురు మహిళలు, ఇద్దరు పురుషులు అక్కడిక్కడే మరణించారు.

## గత పాలకులు ప్రజలకే కాదు దేవుడికీ ద్రోహం

-మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేశారు. భవిష్యత్తులో కాన్సర్ సోకకుండా 15 ఏళ్ల లోపు బాలికలంతా విధిగా హెచ్ పీవీ టీకాలు వేయించుకోవాలని పిలుపునిచ్చారు. ఆడబిడ్డలు సర్వై కల్, బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడకుండా రక్షించేందుకు దేశ వ్యాప్తంగా హెచ్ పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ వల్లే ప్రపంచవ్యాప్తంగా 74 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. దేశంలో ఇవి 63 శాతం ఉండగా మన రాష్ట్రంలో 68 శాతంగా ఉన్నాయి. ఏపీలో క్యాన్సర్ కేసులు 2021లో 29,379 నుంచి 2025కి 32,657కు పెరిగాయి. క్యాన్సర్ కేసుల్లో సుమారు 65 శాతం మహిళల్లో నమోదవుతున్నాయి. బ్రెస్ట్, సర్వై కల్ వంటి క్యాన్సర్లు మహిళల్లో అధికంగా ఉంటే, పురుషుల్లో నోటి క్యాన్సర్ ఎక్కువగా వస్తోంది. సర్వైకల్ క్యాన్సర్ రాష్ట్రంలో ప్రధాన సమస్యగా మారింది. ప్రతీ లక్ష మంది మహిళల్లో 15 నుంచి 20 మంది సర్వై కల్ క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఈ వ్యాక్సిన్ కు రూ.4 వేలు ఖర్చవుతుంది. ప్రజారోగ్యం దష్ట్యా ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. 3.45 లక్షల బాలికల వ్యాక్సినేషన్ కోసం రూ.14.11 కోట్లు వ్యయం చేస్తున్నాం. రాష్ట్రంలో 15 ఏళ్ల లోపు వయసున్న బాలికలు 3,45,377 ఉండగా, విజయనగరం జిల్లాలో 11,989 బాలికలున్నారు. వ్యాక్సినేషన్ కోసం రాష్ట్రంలో 1,645 కోల్డ్ చైన్ పాయింట్లు ఏర్పాటు చేసి 16,912 సిబ్బందిని నియమించామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వైకల్ క్యాన్సర్ కట్టడికి 90--70--90 వ్యూహాన్ని రూపొందించిందని ముఖ్యమంత్రి చెప్పారు. మనదేశంతో పాటు జాంబియా, సౌత్ ఆఫ్రికా, ఇండోనేషియా దేశాల్లో క్యాన్సర్ ఎక్కువగా ఉంటోంది. మన దేశంలో లక్షలో 18 మందికి క్యాన్సర్ సోకుతోంది. క్యాన్సర్ కలుషిత వాతావరణంతో పాటు మన అలవాట్లే దీనికి ప్రధాన కారణం. సర్వైకల్ క్యాన్సర్ నివారణకు 90 శాతం మంది పిల్లలకు వ్యాక్సిన్ ఇవ్వాలి. ఒకసారి డోస్ తీసుకుంటే రక్షణ పొందవచ్చు. ఈ టీకాలు ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రులు ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వేస్తారు, యువిన్ యాప్ ద్వారా ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియను కేంద్రం పర్యవేక్షిస్తోంది. టీకా ఇచ్చాక 30 నిమిషాలు డాక్టర్ల పర్యవేక్షణలో ఉంటారు. దీని వల్ల ప్రమాదం ఉండదు. 15 ఏళ్ల వయసున్న బాలికలంతా ఈ వ్యాక్సిన్ వేసుకునేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

రాష్ట్రంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు విస్తతంగా జరిపిస్తున్నాం. ఇప్పటివరకు 1.72 కోట్ల మందికి నోటి క్యాన్సర్ స్క్రీనింగ్, 90.39 లక్షల మంది మహిళలకు బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ జరిగింది. 20 నెలలుగా ఒకటో తేదీన నేను స్వయంగా పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నాను. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 62,76,322 మందికి పింఛన్లు ఇస్తుండగా, నెలకు రూ.2,726 కోట్ల మేర ఖర్చు చేస్తున్నాం. ఏడాదికి ఈ పథకం కోసం రూ. 33 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. గత ప్రభుత్వంలో ఒక నెల పింఛను తీసుకోకపోతే నిలిపి వేసేవారు. కూటమి అధికారంలోకి వచ్చాక పేదలకు అండగా ఉండాలన్న లక్ష్యంతో మూడు నెలలదీ కలిపి ఒకేసారి తీసుకునే వెసులుబాటు కల్పించాం అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ఆంధ్ర యూనివర్సిటీకి పూర్వవైభవం తీసుకువస్తాం

-మొదటిపేజీ తరువాయి



విద్యాసంస్థగా, 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'గా తీర్చిదిద్దేందుకు ఈ శతాబ్ది ఉత్సవాలు ఒక వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. మార్చి 26 నుంచి ఏప్రిల్ 26వ తేదీ వరకు నెల రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో పూర్వ విద్యార్థులను (అల్యూమిని) విస్తృతంగా భాగస్వాములను చేయాలని సూచించారు. వారి అనుభవాలు, విజయాలు ప్రస్తుత తరానికి స్ఫూర్తినిచ్చేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు.శతాబ్ది ఉత్సవాల్లో ఏయూ ఘన చరిత్ర ప్రతిబింబించేలా అన్ని చర్యలు తీసుకోవాలని, దీనికోసం నియమించిన వివిధ కమిటీల మధ్య సమన్వయం ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. మీడియా పబ్లిసిటీకి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, ప్రస్తుత విద్యార్థులతో కళలు, సంగీతం, సాహిత్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలను వినూత్నంగా రూపొందించాలని చెప్పారు. ఈ ప్రక్రియలో విద్యార్థుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కేవలం యూనివర్సిటీకే పరిమితం కాకుండా, ఉత్తరాంధ్ర ప్రజలను, విద్యార్థులను కూడా ఈ వేడుకల్లో భాగస్వాములను చేయాలని లోకేష్ దిశానిర్దేశం చేశారు. ప్రముఖులతో వివిధ అంశాలపై ప్రత్యేక సదస్సులు నిర్వహించడంతో పాటు, యూనివర్సిటీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాబోయే వందేళ్ల విజన్‌కు తగిన 'యాక్షన్ ప్లాన్'ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో భాగంగా వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ, శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వర్సిటీలో చేపట్టబోయే అభివృద్ధి పనులు, ఏప్రిల్ 26న జరిగే శతాబ్ది స్థాపన దినోత్సవ అజెండాను మంత్రికి వివరించారు. అనుబంధ కళాశాలలను కూడా ఉత్సవాల్లో కలుపుకుని వెళతామని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, యూనివర్సిటీతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ ఉత్సవాల్లో భాగం చేయాలని, దీనిద్వారా విశ్వవిద్యాలయానికి మంచి గుర్తింపు (విజిబిలిటీ) తీసుకురావాలని సూచించారు. శతాబ్ది ఉత్సవాల నిర్వహణ ఒక అద్భుత అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని అభిప్రాయపడ్డారు. ఈ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, పీజీవీఆర్ నాయుడు (గణబాబు), విష్ణుకుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## టెక్ దిగ్గజాల చేతుల్లో ఏఐ

మనం జీవిస్తున్న కాలాన్ని 'ఏఐ యుగం'గా చెప్పుకుంటే అతిశయోక్తి కాదేమో! ఎందుకంటే.. ఇకపై కృత్రిమ మేధస్సు ప్రయోగశాలలకు మాత్రమే పరిమితం కాదు, మన జీవితంలోకి ఒక శక్తిగా ప్రవేశిస్తుంది. ఇది మన కాలపు అత్యంత శక్తివంతమైన సాంకేతిక విప్లవం. డేటా అనే ఇంధనంతో, ఆల్గోరిథమ్స్ అనే యంత్రాంగంతో, అపార గణనశక్తితో దూసుకొస్తున్న ఈ విప్లవం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, ఉపాధి నిర్మాణాన్ని, జ్ఞాన ఉత్పత్తి విధానాలను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఇది ఇప్పుడు సాంకేతిక అభివృద్ధిని మాత్రమే కాదు, ఆధునిక సమాజ రూపురేఖలనే మార్చే పరిణామంగా ముందుకొస్తోంది. విద్యా వైద్యం నుంచి వ్యవసాయం వరకు, పరిశ్రమల నుంచి పరిపాలన వరకు ప్రతీ రంగంలోనూ దీని ప్రభావాలు కనిపిస్తున్నాయి. అయితే ఇక్కడ ప్రశ్న ఒక్కటే? ఈ సాంకేతిక విప్లవం మానవ సమాజాన్ని సమానత్వ దిశగా నడిపిస్తుందా? లేక సంపద కేంద్రీకరణకు మరో ఆయుధంగా మారుతుందా? చరిత్రలోకి చూస్తే మూడు మహా పరివర్తన దశలు స్పష్టంగా కనిపిస్తాయి. వ్యవసాయ విప్లవం, పారిశ్రామిక విప్లవం, ఇప్పుడు మనం జీవిస్తున్న డిజిటల్ విప్లవం. ఈ ప్రతి సాంకేతిక విప్లవం సమాజానికి ఒక గొప్ప వాగ్దానం చేసింది. వ్యవసాయ విప్లవం "ఆహార భద్రత"ను వాగ్దానం చేసింది. పారిశ్రామిక విప్లవం "సమృద్ధి"ని వాగ్దానం చేసింది. ఇప్పుడు డిజిటల్-ఏఐ విప్లవం సైతం అపారమైన "మేధో అవకాశాలు"ను వాగ్దానం చేస్తోంది. కానీ, ఈ ప్రతి దశలోనూ చరిత్ర పదేపదే నిరూపించిన సత్యం ఒకటే? అదేమిటంటే, "వాగ్దానాలు అందరికీ, లాభాలు మాత్రం కొందరికే". వ్యవసాయ విప్లవం మనిషిని స్థిర జీవనానికి తీసుకు వచ్చింది. భూమి ఉత్పత్తి సాధనంగా మారింది. భూ యాజమాన్యమే అధికారానికి పునాది అయింది. సమాజం వర్గీకృతమైంది. అసమానత వ్యవస్థీకృతమైంది. పారిశ్రామిక విప్లవం ఈ నిర్మాణాన్ని కూల్చలేదు, అది రూపం మార్చింది. యూరప్‌లో మొదలైన ఆ మార్పు యంత్రాన్ని, పెట్టుబడిని కేంద్రంగా పెట్టింది. ఉత్పత్తి సామర్థ్యం విపరీతంగా పెరిగింది. కానీ, యంత్రం ఎవరి చేతుల్లో వుందో వారే సంపదను సొంతం చేసుకున్నారు. కార్మికశ్రమ మార్కెట్‌లో వస్తువుగా మారింది. మరి డిజిటల్ విప్లవం ఏం చేయబోతోంది. ఏఐ రాకతో డిజిటల్ విప్లవం అసాధారణమైన శక్తిని సంతరించుకుంది. ఇది కేవలం శ్రమను కాదు, ఆలోచనను కూడా యంత్రాలతో పంచుకుంటోంది. డేటా సేకరణ, విశ్లేషణ, నిర్ణయాలు.. ఇవన్నీ ఆల్గోరిథమ్‌ల చేతుల్లోకి వెళ్తున్నాయి. మానవ మేధస్సు కూడా ఇప్పుడు కొలవదగిన, ప్రోగ్రాం చేయదగిన వనరుగా మారుతోంది. ఏఐ? కేవలం మరో సాంకేతిక సాధనం కాదు, అది ఒక శక్తి సమీకరణం. సమాచారాన్ని గ్రహించి, విశ్లేషించి, నమూనాలు గుర్తించి, అంచనాలు వేయగల వ్యవస్థ. మనిషి మేధస్సు చేసే పనుల్లో కొన్ని యంత్రాలకు అప్పగించగల స్థాయికి టెక్నాలజీ చేరిన దశ ఇది. అందుకే దీని శక్తిసామర్థ్యాలు విస్తృతమైనవి. ఏఐ ప్రధాన శక్తి డేటా విశ్లేషణలో అసాధారణ సామర్థ్యం. లక్షల కోట్ల డేటాలో దాగి ఉన్న నమూనాలను క్షణాల్లో గుర్తించి వ్యాధి నిర్ధారణ, మార్కెట్ ధోరణులు, వాతావరణ మార్పులు వంటి అంశాలను ముందుగానే అంచనా వేయగలదు. పునరావృత పనులు, భారీ లెక్కలు, క్రమబద్ధమైన ప్రాసెసింగ్ వంటి కార్యాలను వేగంగా, తప్పుల్లేకుండా పూర్తిచేసి పరిశ్రమల్లో ఖర్చు తగ్గిస్తుంది, సేవారంగంలో వేగం పెంచుతుంది. ప్రభుత్వ పనుల్లో ఆలస్యం తగ్గిస్తుంది. భవిష్యత్ అంచనాల ద్వారా పంట దిగుబడులు, వ్యాధి వ్యాప్తి వంటి విషయాల్లో ముందస్తు నిర్ణయాలను మెరుగుపరుస్తుంది. విద్య, ఆరోగ్య, వ్యవసాయ సూచనలు అందిస్తుంది. రచన, అనువాదం వంటి సాంకేతికతలతో స్థానిక భాషల్లో జ్ఞానాన్ని ప్రజలకు చేరువచేస్తుంది. సంగీత పరిశోధనల్లో సహాయకారిగా సృజనాత్మక ప్రక్రియను వేగవంతం చేస్తుంది. ప్రకృతి వైపరీత్యాలు, ఆరోగ్య అత్యవసరాల్లో ముందస్తు హెచ్చరికలు ఇచ్చి సంక్షోభ నివారణలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఇవన్నీ కలిపి చూస్తే, ఏఐ ఒక అసాధారణమైన శక్తిగా కనిపిస్తుంది. దాన్ని సరైన దిశలో ఉపయోగిస్తే ప్రజల అభివృద్ధికి ఇదొక తిరుగులేని సాధనం. ఇది ఉత్పాదకతను పెంచగలదు. ఖర్చులను తగ్గించగలదు. సేవలను సమర్థవంతం చేయగలదు. జ్ఞానాన్ని, అవకాశాలను విస్తరించగలదు. కానీ, ఒక సత్యం గుర్తుంచుకోవాలి. మంచిగానీ, చెడుగానీ అది స్వతహాగా ఏదీ చేయదు. ఏఐ శక్తి దాని వినియోగంపై ఆధారపడి ఉంటుంది. అది ప్రపంచాన్ని సమాన అవకాశాల దిశగా మలచగలదు, అసమానతను మరింత గాఢం చేసే దిశగానూ నడుపగలదు. ప్రస్తుత ప్రపంచ దృశ్యాన్ని చూస్తే రెండు ప్రధాన నమూనాలు కనిపిస్తాయి. మొదటిది అమెరికా నమూనా. అక్కడ ఏఐ అభివృద్ధి పూర్తిగా ప్రయివేటు పెట్టుబడిపై ఆధారపడుతోంది. పరిశోధన, ప్రతిభ, ఆవిష్కరణలన్నీ భారీ కార్పొరేట్ పెట్టుబడుల చుట్టూ తిరుగుతున్నాయి. డేటా, డిజిటల్ వేదికలు, ఆల్గోరిథమ్‌లు కొద్దిమంది టెక్ దిగ్గజాల చేతుల్లో కేంద్రీకృతమయ్యాయి. వెంచర్ క్యాపిటల్ ప్రవాహం, స్టాక్ మార్కెట్ అంచనాలు, మోనోపోలీ స్థాయి టెక్ దిగ్గజాల ఆధిపత్యం? ఇవన్నీ ఆ నమూనా స్వభావాన్ని నిర్ధారిస్తున్నాయి. ఇక్కడ ఏఐ ఒక ప్రజా సాధనం కాదు, అది వ్యాపార ఆస్తి. డేటా ప్రజల జీవితాల నుంచి సేకరించబడుతుంది, కానీ, దాని విలువ షేర్ హోల్డర్లకు చేరుతుంది. ఆల్గోరిథమ్‌లు పారదర్శకత కంటే లాభదాయకతను ముందుకు నెడతాయి. పోటీ పేరుతో కొన్ని కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా డేటా మౌలిక వసతులను నియంత్రించే స్థాయికి చేరాయి. ఫలితంగా డిజిటల్ ప్రజాస్వామ్యం క్రమంగా మార్కెట్ ఆధిపత్యంగా మారుతోంది. ఏఐ శక్తి సామూహిక ఆస్తిగా కాక, కార్పొరేట్ మూలధనంగా మారుతున్న ప్రమాదం అక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. ఇక రెండోది చైనా నమూనా. అక్కడ ఏఐ అభివృద్ధి ప్రభుత్వ నియంత్రణలో ఉంటుంది. ఒక వ్యూహాత్మక దిశలో ముందుకు సాగుతోంది. దీర్ఘకాల ప్రణాళిక, ప్రభుత్వ పెట్టుబడులు, నియంత్రణలు, స్వదేశీ టెక్నాలజీ సామర్థ్యాల పెంపు? ఇవి ఆ దిశను నిర్ణయిస్తున్నాయి. తయారీ రంగంతో ఏఐని సమన్వయం చేయడం, స్వంత చిప్ పరిశ్రమను అభివృద్ధి చేయడం, భారీ డేటా మౌలిక వసతులు నిర్మించడం లాంటివన్నీ వేగవంతమైన పురోగతికి దారి తీస్తున్నాయి. అక్కడ సాంకేతికతను కేవలం మార్కెట్ లాభాలకే పరిమితం చేయడంలేదు, జాతీయ అభివృద్ధి వ్యూహంలో భాగం చేస్తున్నారు. ముఖ్యంగా ఆవిష్కరణలను స్వదేశీ సామర్థ్యంగా మార్చుకోవడంలో చైనా దృఢ సంకల్పం గమనించదగినది. ఏఐను దిగుమతి చేసుకునే సాంకేతికతగా కాక, స్వయంగా సృష్టించే శక్తిగా అభివృద్ధి చేయాలన్న దృష్టి అక్కడ స్పష్టంగా ఉంది. మరి ఈ ఆధునికశక్తి సమీకరణంలో భారత్ ఎక్కడ నిలబడి ఉంది? మన దగ్గర విస్తారమైన డేటా ఉంది. యువ జనాభా, డిజిటల్ వినియోగం, చవక ఇంటర్నెట్ మనకు బలమైన వనరులుగా ఉన్నాయి. కానీ, ఆ డేటాకు విలువను సృష్టించే మౌలిక వసతులు మనవేనా? ఆధునిక చిప్ తయారీ, అధిక సామర్థ్య కంప్యూటింగ్, ప్రాథమిక ఏఐ పరిశోధనలపై తగిన కేంద్రీకరణ లేదు. మనం సాంకేతిక సృష్టికర్తలమా? లేక కేవలం వినియోగదారులం మాత్రమేనా? ఇదే కీలక ప్రశ్న. మన దేశంలో ప్రాథమిక పరిశోధనలపై పెట్టుబడులు తక్కువ. విశ్వవిద్యా లయాలు-పరిశ్రమల అనుసంధానం పరిమితం. హై-ఎండ్ చిప్ తయారీ, భారీ కంప్యూటింగ్ మౌలిక వసతులు, స్వదేశీ ఏఐ మోడళ్ల అభివృద్ధి.. ఇవన్నీ ఇంకా కనీస దశలో కూడా లేవు. సమ్మిట్‌లలో పెద్ద లక్ష్యాలు వినిపిస్తున్నా, పరిశోధనలూ ప్రయోగశాలల్లో మాత్రం అవసరమైన కార్యాచరణ కనిపించడం లేదు. దీన్ని అధిగమించకపోతే, మనం ప్రపంచానికి కేవలం డేటా వనరుగా, చవక శ్రమ వనరుగా, వినియోగదారుల మార్కెట్‌గా మారే ప్రమాదం ఉంది. డేటా మన ప్రజలదయి, దాని విలువను సృష్టించే వేదికలు ఇతరులవైతే, అది ఆధునిక రూపంలోని వలసవాదమే అవుతుంది. ఇది కేవలం సాంకేతిక వెనుకబాటుతనం కాదు, ఆలోచనా వెనుకబాటుతనం. పరిశోధనను ఖర్చుగా కాక పెట్టుబడిగా చూడగల దృక్పథం అవసరం. లేకపోతే మనం డిజిటల్ యుగంలో కూడా ముడి వనరులు సరఫరా చేసే దేశంగానే మిగిలిపోతాం. అంతిమంగా మనం గుర్తించాల్సిన అంశమేమింటే.. ఏఐ మనిషిని భర్తీ చేయడానికి వచ్చిన విప్లవం కాదు, మనిషి సామర్థ్యాలను విస్తరించేందుకు వచ్చిన శక్తి. కానీ, చరిత్ర మనకు నేర్పిన పాఠం ఏమిటి? ప్రతి శక్తివంతమైన సాధనం రెండు దిశల్లో ప్రయాణించగలదు. ఒక దిశ అసమానతలు లేని అభివృద్ధి వైపు, మరో దిశ ఆధిపత్యం వైపు. ఏఐ సమాన అవకాశాలను విస్తరించగలదు. గ్రామీణ విద్యార్థికి ఉత్తమ బోధన అందించగలదు. చిన్న రైతుకు శాస్త్రీయ సూచనలు ఇవ్వగలదు. ప్రభుత్వ సేవలను పారదర్శకంగా మార్చగలదు. వైద్యసేవలను అందుబాటులోకి తీసుకురాగలదు. ఇవన్నీ మానవ గౌరవాన్ని పెంచే దిశలు.

# ప్రాథమిక హక్కులు- రాజ్యాంగ రక్షణ

ప్రతి సంవత్సరం మార్చి మొదటి తేదీన, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలు ప్రపంచ పౌర రక్షణ దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1990లో, ఇంటర్నేషనల్ సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ ఈ రోజును ప్రపంచ పౌర రక్షణ దినంగా ప్రకటించింది. ఐసిడిఒ అనేది ఒక లాభాపేక్ష లేని ఇంటర్ గవర్నమెంటల్ ఆర్గనైజేషన్. పౌర హక్కుల పరిరక్షణ, సౌకర్యాల కల్పన, ప్రజల ఎదుగుదల, సురక్షితంగా ఉండటానికి సహాయ పడుతుంది. 59 దేశాలు ఐసిడిఒలో సభ్యత్వం కలిగి ఉన్నాయి. ఇది ఆయా దేశాలలోని పౌర రక్షణ దళాల మానవ వనరుల నిర్వహణను మెరుగు పరచడానికి అనేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తుంది. అన్ని దేశాలు, ప్రజలందరికీ ఆదర్శ నీయమైన ఒక ఉమ్మడి ప్రమాణంగా పత్రాన్ని నిర్దేశిస్తూ 1948 డిసెంబరు 10న ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఐక్య రాజ్యసమితి సర్వప్రతినిధి సభ తీర్మానాన్ని ఆమోదించి, ప్రపంచ మంతటా పరిరక్షించు కోవాల్సిన ప్రాథమిక మానవ హక్కులను తొలిసారిగా నిర్దేశించింది. ఈ సందర్భంగా హక్కుల విషయంలో ఏ ఆర్టికల్ ఏమి సూచిస్తుంది అనే విషయం తెలుసుకుందాం. ఆర్టికల్ 1: మనుషులందరికీ పుట్టుకతోనే స్వేచ్ఛ, సమానత్వం లభిస్తాయి. గౌరవం, హక్కుల విషయంలో అందరూ సమానులే. మనుషులందరికీ సొంత ఆలోచన, అంతః చేతన ఉంటాయి. ఒకరితో మరొకరు సోదరభావంతో మెలగాలి. ఆర్టికల్ 2: ఈ పత్రంలోని అన్ని హక్కులూ, స్వేచ్ఛలూ ప్రతి ఒక్కరికీ ఉంటాయి. జాతి, రంగు, లింగం, భాష, మతం లాంటి అంశాల ప్రాతిపదికగాగాని, రాజకీయ నేపథ్యం వల్లగాని, భిన్నాభిప్రాయం వల్లగాని, జాతీయ లేదా సామాజిక మూలాలవల్లగాని, సంపదలో వ్యత్యాసాల వల్లగాని, పుట్టుక లేదా ఇతర ప్రాతిపదికల వల్లగాని వివక్ష చూపడానికి వీల్లేదు. వ్యక్తులను వారి దేశం లేదా భూభాగం రాజకీయ/అంతర్జాతీయ హోదా ఏమిటనేదాని ప్రాతిపదికగా ఎలాంటి వివక్షా చూపరాదు. ఆర్టికల్ 3: జీవించే హక్కు, స్వేచ్ఛా హక్కు, స్వీయ భద్రతా హక్కు ప్రతి మనిషికీ ఉంటాయి. ఆర్టికల్ 4: ఎవ్వరినీ బానిసగా చేసుకోవడానికి వీల్లేదు. బానిసత్వాన్ని, బానిస వ్యాపారాన్ని అన్ని రూపాల్లో నిషేధించాలి. ఆర్టికల్ 5: ఎవ్వరినీ చిత్రహింసలకు గురిచేయరాదు. ఎవ్వరినీ క్రూరమైన, అమానవీయమైన, అవమాన కరమైన శిక్షకు గురిచేయరాదు. ఆర్టికల్ 6: ప్రతి చోట చట్టం ముందు వ్యక్తిగా గుర్తింపు పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఆర్టికల్ 7: చట్టం ముందు అందరూ సమానులే. ఎలాంటి వివక్షా లేకుండా చట్టపరమైన రక్షణ పొందే హక్కు అందరికీ ఉంది. ఈ డిక్లరేషన్‌కు విరుద్ధంగా, ఎలాంటి వివక్షకు గురికాకుండా అందరికీ సమానమైన రక్షణ ఉంటుంది. ఆర్టికల్ 8: రాజ్యాంగం, లేదా చట్టం కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లే చర్యల విషయంలో సంబంధిత జాతీయ ట్రైబ్యునల్ నుంచి పరిష్కారం పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఆర్టికల్ 9: ఎవ్వరినీ ఏకపక్షంగా అరెస్టు చేయడానికిగాని, నిర్బంధించడానికిగాని, ప్రవాసానికి పంపించడానికిగాని వీల్లేదు. ఆర్టికల్ 10: క్రిమినల్ నేరాభియోగాలపైగాని, తన హక్కులను, బాధ్యతలను నిర్ణయించే విషయంలోగాని స్వతంత్ర, నిష్పాక్షిక ట్రైబ్యునల్ ఆధ్వర్యంలో నిష్పాక్షిక, బహిరంగ విచారణ పొందే హక్కు ప్రతి ఒక్కరికీ సమానంగా ఉంది. ఆర్టికల్ 11: (1) శిక్షార్హమైన నేరాభియోగాన్ని ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరూ, బహిరంగ విచారణలో చట్ట ప్రకారం దోషిగా తేలే వరకు నిర్దోషిగానే భావించాలి. ఈ మేరకు ఆ వ్యక్తికి హక్కు ఉంది. ఈ విచారణలో, తనను తాను రక్షించుకోవడానికి అవసరమైన అన్ని హామీలూ వ్యక్తికి ఉంటాయి. (2) ఎవరైనా వ్యక్తి చేసిన తప్పిదం లేదా పని అది జరిగిన సమయానికి జాతీయ, లేదా అంతర్జాతీయ చట్టం ప్రకారం శిక్షార్హమైన నేరం కాకపోతే, ఆ వ్యక్తిని శిక్షార్హమైన నేరంలో దోషిగా ప్రకటించడానికి వీల్లేదు. శిక్షార్హమైన నేరం జరిగినప్పుడు వర్తించే శిక్ష కన్నా తీవ్రమైన శిక్షను విధించడానికి కూడా వీల్లేదు. ఆర్టికల్ 12: ఏ ఒక్కరి వ్యక్తిగత గోప్యత, కుటుంబం, ఇల్లు, ఉత్తరప్రత్యుత్తర విషయాల్లో ఏకపక్షంగా జోక్యం చేసుకోవడానికిగాని, గౌరవ



ప్రతిష్ఠలపై దాడి చేయడానికిగాని వీల్లేదు. అలాంటి జోక్యం, దాడుల నుంచి చట్టపరమైన రక్షణ పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఆర్టికల్ 13:(1) దేశంలో స్వేచ్ఛగా తిరిగే, నివసించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. (2) సొంత దేశం నుంచి లేదా ఏ దేశం నుంచి అయినా వెళ్లిపోయే హక్కు, తన దేశానికి తిరిగి వచ్చే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నాయి. ఆర్టికల్ 14: (1) పీడన నుంచి తప్పించుకొనేందుకు ఇతర దేశాలను ఆశ్రయం అడిగే, పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నాయి. (2) ఐక్యరాజ్యసమితి సూత్రాలకు, ప్రయోజనాలకు విరుద్ధమైన చర్యలు లేదా రాజకీయతేర నేరాలపై నిజమైన ప్రాసిక్యూషన్ జరిగే సందర్భంలో ఈ హక్కు ఉండకపోవచ్చు. ఆర్టికల్ 15: (1) ఏదైనా జాతీయతను కలిగి ఉండే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. (2) ఎవరికీ ఏకపక్షంగా జాతీయతను తొలగించకూడదు, అలాగే జాతీయతను మార్చుకొనే హక్కును నిరాకరించ కూడదు. ఆర్టికల్ 16: (1) జాతి, జాతీయత లేదా మతం పరిమితులు లేకుండా పెళ్లి చేసుకొనేందుకు, కుటుంబాన్ని కలిగి ఉండేందుకు వయోజనులైన మహిళలకు, పురుషులకు హక్కు ఉంది. వివాహం చేసుకొనేటప్పుడు, వివాహ బంధంలో ఉన్న కాలంలో, దీనిని రద్దుచేసుకొనేటప్పుడు వారికి సమానమైన హక్కులు ఉంటాయి. (2) పెళ్లికి ఇద్దరు వ్యక్తుల్లో స్వేచ్ఛాయుత, సంపూర్ణ అంగీకారం ఉంటేనే పెళ్లి చేసుకోవాలి. (3) సమాజంలో కుటుంబమనేది ఒక సహజమైన, ప్రాథమికమైన భాగం. కుటుంబానికి సమాజం, రాజ్యాం రక్షణ కల్పించాలి. ఆర్టికల్ 17: (1) సొంతంగాగాని, ఇతరులతో కలసి గాని ఆస్తులు కలిగి ఉండేందుకు ప్రతి ఒక్కరికీ హక్కుంది.(2) ఎవరికీ ఏకపక్షంగా ఆస్తిని దూరం చేయడానికి వీల్లేదు. ఆర్టికల్ 18: స్వేచ్ఛాయుత అంతఃచేతనత్వానికి, స్వేచ్ఛగా ఆలోచించడానికి, మతాన్ని పాటించడానికి ప్రతి ఒక్కరికీ హక్కు ఉంది. మతాన్ని లేదా విశ్వాసాన్ని మార్చుకొనే హక్కు ఇందులో భాగం. ఒంటరిగాగాని, ఇతరులతో కలిసిగాని ప్రైవేటుగాగాని, బహిరంగంగాగాని తన మతవిశ్వాసాలను పాటించే, బోధించే స్వేచ్ఛ, పూజించే స్వేచ్ఛ అందరికీ ఉన్నాయి. ఆర్టికల్ 19: ప్రతి ఒక్కరికీ భావ ప్రకటనా హక్కు ఉంది. ఇతరుల జోక్యం లేకుండా సొంత అభిప్రాయాలు కలిగి ఉండే హక్కు, సరిహద్దులతో సంబంధం లేకుండా ఏ మార్గం నుంచైనా సమాచారం, ఆలోచనలు కోరే, స్వీకరించే హక్కు ఇందులో భాగం. ఆర్టికల్ 20: (1) స్వేచ్ఛగా శాంతియుతంగా సమావేశమయ్యేందుకు, సంఘంగా ఏర్పడేందుకు ప్రతి ఒక్కరికీ హక్కుంది. (2) ఏదైనా సంఘంలో భాగస్వామి కావాలని ఎవరినీ బలవంతపెట్టడానికి వీల్లేదు. ఆర్టికల్ 21: ప్రతి ఒక్కరికీ తమ దేశ ప్రభుత్వంలో ప్రత్యక్షంగా లేదా ఎంచుకున్న ప్రతినిధి ద్వారా భాగస్వామ్యమయ్యే హక్కు ఉంది. 1) ప్రతి ఒక్కరికీ తమ దేశంలో ప్రభుత్వ సేవలను సమానంగా పొందే హక్కు ఉంది. 2) ప్రభుత్వానికి ప్రజాభీష్టం ప్రాతిపదిక కావాలి. నిర్దేశిత కాలానికి జరిగే నిజమైన ఎన్నికల్లో ఈ ప్రజాభీష్టం వ్యక్తంకావాలి. ఈ ఎన్నికల్లో సార్వజనీన, సమానమైన ఓటు హక్కు ఉంటుంది. రహస్య ఓటింగ్ లేదా దానికి సమానమైన స్వేచ్ఛాయుత ఓటింగ్ నిర్వహించాలి. ఆర్టికల్ 22: సమాజంలో సభ్యులుగా ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత హక్కు ఉంది. తన గౌరవానికి, తన వ్యక్తిత్వం స్వేచ్ఛగా అభివృద్ధి చెందటానికి ఆవశ్యకమైన ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులను జాతీయ కృషి, అంతర్జాతీయ సహకారం ద్వారా దేశ వనరులకు అనుగుణంగా సాధించుకునే హక్కు ఉంది. ఆర్టికల్ 23: (1) ప్రతి ఒక్కరికీ పని చేయడానికి హక్కుంది. స్వేచ్ఛగా కోరుకొన్న ఉపాధిని పొందడానికి, పనిచేయటానికి న్యాయమైన, అనుకూలమైన పరిస్థితులు పొందడానికి, నిరుద్యోగిత నుంచి రక్షణ పొందటానికి అందరికీ హక్కుంది. (2) ప్రతి ఒక్కరికీ ఎలాంటి వివక్షా లేకుండా సమాన పనికి సమాన వేతనం పొందే హక్కు ఉంది. (3) పని చేసే ప్రతి ఒక్కరికీ తాను, తన కుటుంబం మానవ గౌరవంతో మనుగడ సాగించటానికి హామీ ఇచ్చేలా న్యాయమైన, అనుకూలమైన వేతనం పొందే హక్కు ఉంది. అవసరమైతే ఇతర మార్గాల్లో అదనంగా సామాజిక రక్షణ పొందే హక్కు ఉంది. (4) ప్రతి ఒక్కరికీ తన ప్రయోజనాలను కాపాడుకోవటం కోసం కార్మిక సంఘాలు ఏర్పాటు చేయటానికి, వాటిలో చేరటానికి హక్కు ఉంది. ఆర్టికల్ 24: ప్రతి ఒక్కరికీ పనిగంటలకు హేతుబద్ధమైన పరిమితిని, నిర్దేశిత కాలానికి వేతనంతో కూడిన సెలవులను పొందే హక్కు, విశ్రాంతి, విరామం తీసుకునే హక్కు ఉన్నాయి. ఆర్టికల్ 25: (1) ప్రతి వ్యక్తికీ ఆహారం, దుస్తులు, నివాసం, వైద్యసేవలు, ఇతర సామాజిక సేవలు సహా.. తను, తన కుటుంబ ఆరోగ్య, సంక్షేమాలకు తగిన జీవన ప్రమాణం పొందే హక్కు ఉంది. నిరుద్యోగం, అనారోగ్యం, వైకల్యం, వైధవ్యం, వృద్ధాప్యం లేదా తన నియంత్రణలో లేని ఇతర కారణాల వల్ల జీవనోపాధి లేకపోవటం నుంచి భద్రత పొందే హక్కు ఉంది. (2) మాతృత్వం సమయంలో మహిళలకు, బాల్యదశలో చిన్నారులకు ప్రత్యేక సేవ, సహాయాలు పొందే హక్కు ఉంది. పెళ్లి ద్వారా పుట్టినా, పెళ్లి కాకుండా పుట్టినా చిన్నారులు అందరికీ సమానమైన రక్షణ లభించాలి. ఆర్టికల్ 26:(1) ప్రతి ఒక్కరికీ విద్యాహక్కు ఉంది. కనీసం ప్రాథమిక, మౌలిక స్థాయుల్లో అయినా అందరికీ విద్య ఉచితంగా అందాలి. ప్రాథమికవిద్య తప్పనిసరిగా ఉండాలి. సాంకేతిక విద్య, వృత్తినైపుణ్య విద్య అందుబాటులో ఉండాలి. ఉన్నతవిద్య ప్రతిభ ప్రాతిపదికన అందరికీ సమానంగా అందుబాటులో ఉండాలి. (2) మానవ వ్యక్తిత్వం సంపూర్ణంగా వికసించేలా, మానవ హక్కులను, మౌలిక స్వాతంత్ర్యాలను గౌరవించేదిగా విద్య ఉండాలి. (3) తమ పిల్లలకు ఏ తరహా విద్య అందించాలో ఎంచుకునే హక్కు తల్లిదండ్రులకు ఉంది. ఆర్టికల్ 27: (1) ప్రతి ఒక్కరికీ సమాజ సాంస్కృతిక జీవనంలో స్వేచ్ఛగా పాలుపంచుకోవడానికి, కళలను ఆస్వాదించడానికి, శాస్త్రీయ పురోగతిలో, వాటి ప్రయోజనాల్లో భాగం పంచుకోవడానికి హక్కు ఉంది. (2) ప్రతి వ్యక్తికీ తను సృజించిన ఎలాంటి శాస్త్రీయ, సాహిత్య, కళా ఉత్పత్తుల నుంచి లభించే నైతిక, భౌతిక ప్రయోజనాలను పరిరక్షించుకునే హక్కు ఉంది. ఆర్టికల్ 28: ఈ ప్రకటనలో నిర్దేశించిన హక్కులు, స్వాతంత్ర్యాలు సంపూర్ణంగా సాకారమయ్యే సామాజిక, అంతర్జాతీయ పరిస్థితులు పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఆర్టికల్ 29: తన వ్యక్తిత్వం సంపూర్ణంగా వికసించటం సాధ్యమయ్యే సమాజం పట్ల ప్రతి ఒక్కరికీ బాధ్యతలు కూడా ఉన్నాయి. (1) ప్రతి ఒక్కరూ తన హక్కులు, స్వాతంత్ర్యాలను వినియోగించుకొనే క్రమంలో- ప్రజాస్వామ్య సమాజంలో ఇతరుల హక్కులు, స్వాతంత్ర్యాలకు తగిన గుర్తింపు, గౌరవం, నైతికత, శాంతిభద్రతలు, సాధారణ సంక్షేమం కోసం చట్టం నిర్దేశించిన పరిమితులకు మాత్రమే లోబడి ఉండాలి. (2) ఈ హక్కులు, స్వాతంత్ర్యాలను ఏ విధంగానూ ఐక్యరాజ్యసమితి లక్ష్యాలు, సూత్రాలకు వ్యతిరేకంగా ఉపయో గించరాదు. ఆర్టికల్ 30: ఈ ప్రకటనలోని ఏ అంశమైనా ఇందులో నిర్దేశించిన హక్కులు, స్వాతంత్ర్యాల్లో దేనినైనా ధ్వంసం చేసేందుకు, లేదా ఏమైనా చేసేందుకు ఏ రాజ్యానికీ, సంఘానికీ, వ్యక్తికీ వీలు కల్పిస్తున్నట్లు భావించరాదు.

# భారతీయ తొలి నోబెల్ గ్రహీత

వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని, దాని వల్లనే అది తన గమనాన్ని మార్చుకుంటుందని తన సిద్ధాంతాల ద్వారా రుజువు చేశారు రామన్. సూర్యుని నుంచి వెలువడే తెలుపు వర్ణపు కాంతి వాయువులోని అణువులపై పడి, వాటి ప్రయాణ దిశను మార్చు కుంటాయని తన పరిశోధనల ద్వారా తెలుసుకున్న సి.వి. రామన్ ఓ సిద్ధాంతాన్ని సూత్రీకరించాడు. వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని 1928 సంవత్సరం, ఫిబ్రవరి 28న రామన్ మొట్ట మొదటిసారి ప్రకటించారు.పారదర్శకంగా ఉన్న ఘన లేదా ద్రవ లేదా వాయు మాధ్యమం గుండా కాంతిని ప్రసరింప చేసినప్పుడు అది తన స్వభావాన్ని మార్చు కుంటుంది. ఈ విషయాన్ని 1928 మార్చి 16 న బెంగుళూరులో జరిగిన శాస్త్రజ్ఞుల సదస్సులో చూపించాడు. అతను అనుకున్నట్లే 1928 ఫిబ్రవరి 28 న "రామన్ ఎఫెక్టు" ఆవిష్కరించడం జరిగింది. ఈ పరిశోధనను అభినందిస్తూ బ్రిటీష్ ప్రభుత్వం 1929 లో "నైట్ హుడ్" బిరుదుతో సత్కరించింది. రామన్ ఎఫెక్ట్‌ను కనిపెట్టిన చంద్రశేఖర వేంకట రామన్ 28-02-1928న తన పరిశోధనా ఫలితాన్ని ధృవపరచుకున్న దినాన్ని (నేషనల్ సైన్స్ డేజాతీయ విజ్ఞాన దినోత్సవము) గా భారతదేశంలో ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నారు. సైన్సులో ఎవరూ చేయలేని సాహసాలను అత్యంత సునాయాసంగా చేసి చూపించి, విశ్వ వినువీధిలో భారత కీర్తి పతాకాన్ని రెపరెప లాడించిన మహా జ్ఞాని చంద్రశేఖర్ వెంకటరామన్ (సి వి రామన్). వైజ్ఞానిక రంగంలో ప్రపంచ దేశాలను తలదన్నేలా భారత్‌ను శక్తివంతంగా చూపి, అబ్బుర పరిచే ప్రయోగాలకు నిలువెత్తు వేదికలా నిలిచారు సర్ సివి రామన్. వైజ్ఞానిక రంగంలో తొలి నోబెల్ అందుకున్న విజ్ఞాన ఖని. ఒక్క మాటలో చెప్పాలంటే వైజ్ఞానిక శాస్త్రానికే వైద్యుడిలా మారిన మహోన్నతుడు. ఆధునిక భారత విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనా ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప జేసిన వ్యక్తుల్లో సర్ సీవి రామన్ మొదటివారు. సీవీ రామన్ నవంబర్ 7, 1888 తమిళనాడులోని తిరుచురాపల్లిలో జన్మించారు. తండ్రి చంద్రశేఖర్ అయ్యర్, తల్లి పార్వతి అమ్మాళ్. తండ్రి విశాఖపట్నంలోని ఏవీఎన్ కళాశాలలో లెక్చరర్ గా పని చేయడం వల్ల రామన్ బాల్యం, విద్యాభ్యాసం అక్కడే జరిగింది. అనంతరం మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో చేరి 19 ఏళ్లకు ఫిజిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. ఆ తర్వాత తల్లిదండ్రుల కోరిక మేరకు ఐసిఎస్ పాసై కలకత్తా ప్రభుత్వ ఆర్థికశాఖలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్‌గా చేరారు. ఆ సమయం లోనే పరిశోధనలపై ఆసక్తి పెంచుకున్నారు. పరిశోధనల కోసం భారతీయులు విదేశాలకు వెళ్లడమేమిటి?. విదేశీయులే.. పరిశోధనల కోసం ఇక్కడకు రావాలని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి రామన్. రామన్ ముందు వరకూ సైన్స్‌లో నోబెల్ బహుమతులు పాశ్చాత్యులకే దక్కేవి. కానీ, రామన్ అచ్చమైన భారతీయునిగా ఈ గడ్డపైనే చదువుకొని, తలమానికమైన పరిశోధన జరిపి సైన్సులో దేశ శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పి భారత్ కు నోబెల్ సాధించి పెట్టారు. 'నా మతం సైన్సు.. దానినే జీవితాంతం ఆరాధిస్తా..' అని చెప్పి తుదిశ్వాస వరకూ శాస్త్రాన్వేషణ లోనే గడిపిన దార్శనికుడు. "విజ్ఞాన శాస్త్ర సారాంశం, ప్రయోగ శాలల పరికరాలతో వికసించదు. నిరంతర పరిశోధన, స్వంతంత్రంగా ఆలోచించే ప్రవృత్తి ఇవే విజ్ఞాన శాస్త్ర సాగరాన్ని మథించి వేస్తాయి" అంటూ ఆయన చేసిన ప్రసంగం నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. ఉదయాకాశంలోని వెలుగుల్లో చెట్లు ఎంత అందంగా కనబడతాయో మీరు ఎప్పుడైనా గమనించారా? నాకు వీటిని చూస్తూ ఉంటే స్ఫటిక నిర్మాణం గురించిన ఆలోచనలు వస్తుంటాయి. అందుకే "విజ్ఞానం అత్యుత్తమైన సృజనాత్మక కళారూపం అని రామన్ ఎప్పుడూ చెబుతుండేవారు. మెర్క్యూరీ ల్యాంప్ నుండి ఏకవర్ణ కాంతి తరంగాలను ఒక పారదర్శక యానకం గుండా ప్రసరింపజేస్తే, యానక ధర్మాలపై ఆధారపడి ఆ కాంతిలో కొంత భాగం వివర్తనం చెంది, తక్కువ తరంగ ధైర్ఘ్యం గల కాంతిగా బహిర్గత మౌతుంది. సముద్ర జలంపై ఇదే ప్రక్రియతో నీలి రంగు కాంతి బహిర్గతమవుతుంది. దీనినే 'రామన్ ఫలితం' (రామన్ ఎఫెక్ట్) అంటారు. రామన్ జీవితంలో మరో మైలురాయి రామన్ ఎఫెక్ట్ సిద్ధాంతం. ఈ రామన్ ఎఫెక్టు అసామాన్య మైనదని, అందులో 200 రూపాయలు కూడా ధర చేయని పరికరాలతో ఆ విషయ నిరూపణ జరగడం అద్భుతమైనదని ప్రపంచ శాస్త్రజ్ఞులంతా రామన్ ను అభినందించారు. అఖండ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందిన రామన్, ఫిజిక్స్ రంగంలో రామన్ ఎఫెక్ట్ కనుగొని చరిత్ర సృష్టించిన ఫిబ్రవరి 28 నే జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపు కొంటున్నాం. రామన్ నూటికి నూరుపాళ్ళూ భారతీయునిగా ఈ గడ్డపైనే చదువుకొని, పరిశోధనలు జరిపి సైన్సులో శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పి భారత్ కు నోబెల్ సాధించి పెట్టారాయన. 1913 లో సాహిత్యంలో మనదేశం నుండి నోబెల్ బహుమతి పొందిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అనంతరం సైన్సు రంగంలో విజయ ఢంకా మ్రోగించిన అఖండ ప్రజ్ఞాశాలి రామన్ ఒక్కరే కావడం దేశానికి గర్వకారణం. రామన్ పరిశోధనలు సైన్సులో, పారిశ్రామిక రంగంలోనూ క్రొత్తపుంతలు త్రొక్కడానికి దారితీసింది. శాస్త్ర రంగంలో రామన్ స్పెక్ట్రో స్కోపీ ఆవిర్భావానికి "భారతరత్న", 1957 లో "లెనిన్ శాంతి బహుమతి" లభించాయి. కాంతి ప్రసరణపై జరిపిన పరిశోధనలకు "నోబెల్ బహుమతి" లభించింది. స్వాతంత్ర్యం రాగానే రామన్ కు మొట్టమొదటి నేషనల్ ప్రొఫెసర్ గా ప్రభుత్వం నియమించి గౌరవించింది. 1948 లో బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ గా రిటైరయ్యారు. దృష్టి, కాంతి, ధ్వని, వర్ణాలు, ద్రవాల తలతన్యత, ఖనిజాలు, డైమండ్, క్రిస్టల్ తదితర అంశాలపై పరిశోధనలు జరిపిన సి.వి. రామన్ సుమారు 465 పరిశోధన పత్రాలను వెలువరించాడు. వాటిని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగుళూరు వారు సేకరించి భద్రపరిచారు. 1949 లో బెంగుళూరులో రామన్ రీసెర్చి ఇన్స్టిట్యూట్ స్థాపించి, 1970 నవంబరు 27 న ఆయన మరణించే వరకూ, ఆ సంస్థలో పరిశోధనలు జరిపి, మన దేశంలో సైన్సు అభివృద్ధికి మార్గదర్శకు లయ్యారు. 1971 నవంబర్ 21 న సీ.వీ. రామన్ పోస్టేజి స్టాంపును భారత ప్రభుత్వం వెలువరించి ఆ మహా శాస్త్రజ్ఞుడిని గౌరవించింది.విజ్ఞాన ఆవిష్కరణల్లో భారతీయులకు నోబెల్ రావడం గగన సదృశం. సర్ సివి రామన్ ఆ ఘనత సాధించారు. అంతేకాదు, విజ్ఞాన శాస్త్రంలో ఆఘనత సాధించిన ఏకైక ఆసియా వాసిగానూ ఖ్యాతి గడించారు.

# మంత్రి సత్య కుమార్ యాదవ్ కార్యాలయం చొరవతో తుంపర్తి కాలనీలో మంచినీటి సమస్యకు తక్షణ పరిష్కారం

### ప్రజా ఫిర్యాదుపై తక్షణ స్పందన కాలిపోయిన మోటార్ వైర్లు మరమ్మత్తు

### స్పందన, పరిశీలన, పరిష్కారం విధంగా పరుగులు పెడుతున్న మంత్రి సత్య కుమార్ యాదవ్ కార్యాలయం

### హరీష్ బాబు పరిశీలన అనంతరం వెంటనే చర్యలు నీటి సరఫరా పునరుద్ధరణ



**ధర్మవరం, ఫిబ్రవరి 28:బహుజన వేదిక న్యూస్** ధర్మవరం పట్టణం తుంపర్తి కాలనీలో నీటి మోటార్ వైర్లు కాలిపోవడంతో గత 20 రోజులుగా తీవ్ర మంచినీటి సమస్య నెలకొన్న నేపథ్యంలో కాలనీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ విషయాన్ని మంత్రి సత్య కుమార్ యాదవ్ గారి కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను వెంటనే పరిగణనలోకి తీసుకొని, మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు శనివారం స్వయంగా తుంపర్తి కాలనీకి వెళ్లి అక్కడి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానికులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత ఈఓఆర్డి మరియు పంచాయతీ సెక్రటరీలతో మాట్లాడిన ఆయన, సమస్యను అత్యవసరంగా పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికార యంత్రాంగం వేగంగా స్పందించాలని ఆయన కోరారు. ఈ మేరకు అధికారులు వెంటనే స్పందించి కాలిపోయిన నీటి మోటార్ వైర్లను తక్షణమే మరమ్మత్తు చేయించారు. దీంతో కాలనీ ప్రజలకు మంచినీటి సరఫరా పునరుద్ధరించబడింది. ప్రజల ప్రాథమిక అవసరాల విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని, సమస్యలు వచ్చిన వెంటనే స్పందించి పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని హరీష్ బాబు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో మంత్రి కార్యాలయం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటుందని పేర్కొన్నారు. సమస్యను వేగంగా పరిష్కరించినందుకు కాలనీ ప్రజలు మంత్రి కార్యాలయానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ తక్షణ స్పందనతో తమ ఇబ్బందులు తొలగినందుకు హర్షం వ్యక్తం చేశారు

# ధర్మవరం పట్టణంలోని నెహ్రూ నగర్ ప్రాథమి కోన్నత పాఠశాలలో భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా సరస్వతి పూజ

- ధర్మవరం నెహ్రూ నగర్ ప్రాథమి కోన్నత పాఠశాలలో నిర్వహించిన సరస్వతి పూజ కార్యక్రమంలో పాల్గొన్న హరీష్ బాబు
- విద్యార్థుల అభ్యున్నతే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం లక్ష్యం హరీష్ బాబు
- విద్య మనిషిని ఉన్నత శిఖరాలకు చేర్చే శక్తి హరీష్ బాబు
- విద్య, విలువలు, బాధ్యత విజయవంతమైన జీవితానికి మూడు సూత్రాలు హరీష్ బాబు
- విద్యార్థుల కోసం సైకిళ్లు, పరీక్ష ఫీజులు, శిక్షణలు మంత్రి సేవలను వివరించిన హరీష్ బాబు





**ధర్మవరం, ఫిబ్రవరి 28: బహుజన వేదిక న్యూస్** ధర్మవరం పట్టణంలోని నెహ్రూ నగర్ ప్రాథమి కోన్నత పాఠశాలలో విద్యా, సాంస్కృతిక విలువలకు ప్రతీకగా నిర్వహించిన సరస్వ తి పూజ కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. విద్యార్థుల విద్యాభివృద్ధికి జ్ఞానదేవి సరస్వతి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమానికి, పాఠశాల యాజమాన్యం ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన, విద్య మనిషి జీవితాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చే శక్తి అని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, విలువలతో చదువులో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. విద్యతో పాటు నైతిక విలువలు, సమాజం పట్ల బాధ్యతాభావం పెంపొందించుకోవడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూనే, ఆయన స్వయంగా గత 15 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సంస్కృతి సేవా సమితి ద్వారా విద్యార్థులు, నిరుద్యోగ యువత అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని వివరించారు. ఈ క్రమంలో ధర్మవరం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే సుమారు 2,000 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేస్తున్నారని అందులో భాగంగా ధర్మవరం పట్టణంలో 1,000 సైకిళ్లు ఇప్పటికే అందజేసినట్లు తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 2,087 మంది పదో తరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్షల ఫీజును మంత్రి స్వయంగా భరించినట్లు వెల్లడించారు. అదేవిధంగా మెగా జాబ్ మేళా ద్వారా 2,400 మంది యువతియువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. ధర్మవరం నియోజకవర్గానికి చెందిన 25 మంది యువతులకు లక్ష్మయ్య అకాడమీ ద్వారా ఉచిత శిక్షణ మరియు వసతి హైదరాబాద్ లో కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే 12 మంది యువతులకు నంద్యాలలోని గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ ద్వారా ఉచిత బ్యాంకింగ్ కోచింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ గారు ఎల్లప్పుడూ విద్యా రంగాభివృద్ధికి యువత శక్తి వికాసానికి ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు కల్పించేందుకు కట్టుబడి పనిచేస్తున్నారని హరీష్ బాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మిస్ శారదమ్మ, ప్రైమరీ హెడ్మాస్టర్ వెంకటేశ్వర్లు, పాఠశాల చైర్మన్, బీజేపీ నాయకులు అశ్వత్ నారాయణ, బిల్లే శ్రీనివాసులు, కుంచెపు నారప్ప, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు మరియు పలువురు నాయకులు పాల్గొన్నారు

# ఎన్టీఆర్ భరోసా పేదలకు ఆర్థిక భరోసా





ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

**గార్లదిన్నె ఫిబ్రవరి 28:బహుజన వేదిక న్యూస్** గార్లదిన్నె మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ,ఋణజజ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవ రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలోని పింఛన్ లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి పింఛన్ డబ్బులు పంపిణీ చేశారు.ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ పేదల సేవలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో ఇంతపెద్ద ఎత్తున ఎన్టీఆర్ భరోసా కింద పేదలకు ఆర్థిక చేయూత అందించడం పట్ల రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ మీటింగ్ లకు రాలేదని పింఛన్ దారులను మానసిక ఒత్తిడికి గురి చేశారు. పేదలను ఆర్థికంగా ఆదుకోవాలని రూ.4000, 6000, 10000 నుండి 15000 ల వరకు పెంచి, కుటుంబాలకు అండగా కూటమి ప్రభుత్వం నిలిచిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్న కూడా వితంతు మహిళలు కు స్పౌజు పింఛన్లు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం అటువంటి మహిళలు ను గుర్తించి, వితంతు పింఛన్లు ఇచ్చిందన్నారు. అనంతరం గ్రామంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారు ఎదురుకుంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలు,ఇండ్ల పట్టాలు అలాగే ముకుందపురం మరియు దాని పరిధిలోని ఇతర గ్రామాలకు నీరు సరిగ్గా రాకపోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేయగా వెంటనే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు

## పుత్తా పుల్లారెడ్డి సాహిత్యం పై పరిశోధనలు జరగాలి

విద్వాన్, డాక్టర్ గానుగపెంట హనుమంతరావు.



**బద్వేలు, ఫిబ్రవరి 28: బహుజన వేదిక న్యూస్** భారత భారతి, అభినవ వ్యాస బిరుదాంకితులు పుత్తా పుల్లారెడ్డి సాహిత్య రచనలపై పరిశోధనలు జరగాలని భారత రాష్ట్రపతి వార్డు గ్రహీత, కవయిత్రి మొల్ల సాహిత్య పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై విశ్వవిద్యాలయాలు కూడా స్పందించి, పుల్లారెడ్డికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయాలని కోరారు. శనివారం ఐఎంఏ హాల్లో వైయస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో, పుత్తా పుల్లారెడ్డి వాంగ్మయ సమాలోచన సమావేశంలో హనుమంతరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ, పుత్తా పుల్లారెడ్డి రాయలసీమకే కాక, ముఖ్యంగా కడప జిల్లాకు గౌరవాన్ని తీసుకొచ్చిన అవిశ్రాంత సాహిత్య సేవకులని కొనియాడారు. 50 ఏళ్లకు పైగా అవిరళ కృషి చేసి ,భారత, భాగవత ,రామాయణాలనే గాక, దాదాపు 20 గ్రంథాలను వ్రాసిన గొప్ప పండితులన్నారు. అపూర్వ సోదరులైన పుత్తా పుల్లారెడ్డి సాహిత్య సామాజిక రంగాలలో అగ్రగామి కాగా, డాక్టర్ పుత్తా బాలిరెడ్డి వైద్యరంగంలో మేరు శిఖరం అన్నారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రాలలో పుల్లారెడ్డి లాగా సాహిత్య కృషి చేసిన వారు అరుదుగా ఉన్నారన్నారు. మధ్యాహ్న కార్యక్రమంలో వైయస్సార్ జిల్లా రచయితల సంఘం కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, సభ్యులు స్వరూప రాణి జీవి సాయిప్రసాద్, అనుగూరు చంద్రశేఖర్ రెడ్డి, వెల్లాల వెంకటేశ్వర చారి, స్వరూప రాణి, భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, తవ్వ వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం 50 ఏళ్లకు పైగా వివిధ రంగాలలో నిరంతరకృషి చేసిన విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావును శాలువా జ్ఞాపికతో నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

## జిల్లాలోని 6,74,333 రైస్ కార్డుదారులకు సరిపడా నిత్యావసర సరుకులు చౌక ధరల దుకాణాలకు జిల్లా జాయింట్ కలెక్టర్



**అనంతపురం, ఫిబ్రవరి 28 :బహుజన వేదిక న్యూస్** అనంతపురము జిల్లాలోని 6,74,333 రైస్ కార్డుదారులకు సరిపడా నిత్యావసర సరుకులు చౌక ధరల దుకాణాలకు కేటాయించడం జరిగింది. ప్రతి నెల 1వ తేది నుండి 15వ తేదీ వరకు ఉదయం 8.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు తిరిగి సాయంత్రం 4.00 గంటల నుండి రాత్రి 8.00 గంటల వరకు రేషన్ షాపుల వద్దనే నిత్యావసర సరుకులు పంపిణీ చేయబడును. కార్డుదారులు తమకు దగ్గరలోగల ఏ చౌక ధరల దుకాణం వద్దనైన నిత్యావసర సరుకులను పోర్టబిలిటీ ద్వారా పొందవచ్చును. నిత్యావసర సరుకులు అందవని ఏ ఒక్క కార్డుదారుడు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.మార్చి నెల 2026 నెలకుగాను, బియ్యం ఉచితంగా, మరియు బియ్యంకు బదులుగా జొన్నలు మరియు రాగులు 3 కేజీల వరకు ఉచితంగా పొందవచ్చును. ప్రాధాన్యత (ధీూా) కార్డుకు చక్కర 1/2 కేజీకి, 17/-రూపాయలు/ఏఏవై కార్డుకు కేజీ. 13.50/- రూపాయల చొప్పున పంపిణీ చేయబడును. జిల్లాలోని కార్డుదారు లందరూ వినియోగించుకోవచ్చును.అదే విధముగా జిల్లా నందు అన్ని మున్సిపాల్టీలలో మరియు అనంతపురం రూరల్ మండలంలో గల రేషన్ కార్డుదారులకు మాత్రమే, కార్డునకు 1 కేజీ గోదుమపిండి 20/- రూపాయల చొప్పున పంపిణీ చేయబడును. జిల్లాలోని 65 సంవత్సరములు పైబడిన 64,172 రైస్ కార్డుదారులకు, వికలాంగులకు మరియు అనారోగ్య కారణంగా మంచానికి పరిమితమైన కార్డుదారులందరికి ఈ నెల 26వ తేది నుండి వారికి కేటాయించిన నిత్యావసర సరుకులు సంబంధిత చౌక ధరల దుకాణదారులే, కార్డుదారుల ఇంటి వద్దకు వచ్చి అందజేయడం జరుగుచున్నది. కావున 65 సంవత్సరములు పైబడిన బియ్యం కార్డుదారులు, వికలాంగులు మరియు అనారోగ్య కారణంగా మంచానికి పరిమితమైన కార్డుదారులెవరు కూడా, సరుకుల కొరకు చౌక ధరల దుకాణం వద్దకు రాకూడదని తెలియజేయడమైనది.జిల్లాలోని చౌకధరల దుకాణదారు లందరూ కూడా తమ వంతు బాధ్యతగా 65 సంవత్సరములు పైబడిన కార్డుదారుల సరుకులను, ఇంటి వద్దకే వెళ్ళి తప్పనిసరిగా సరుకులను అందజేయవలసినదిగా కోరడమైనది. నిత్యావసర సరుకుల పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలున్నా జిల్లా కలెక్టరు వారి కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెం: 8500292992కు ఫిర్యాదు చేయవలెను.ఈ విషయంలో, జిల్లా నందుగల అందరు తహసిల్దార్లు మరియు పౌరసరఫరాల డిప్యూటి తహసిల్దార్లు వారి పరిధిలో గల చౌక ధరల దుకాణదారులు తేది: 01.03.2026 నుండి తేది 15.03.2026 వరకు, వారియొక్క చౌక ధరల దుకాణములు తెరచియుంచి కార్డుదారులకు అందుబాటులో ఉండి కార్డుదారులకు ఎటువంటి అసౌకర్యము కలుగజేయకుండా నిత్యావసర సరుకులు పంపిణీ జరుగునట్లు పర్యవేక్షించవలయునని కోరడమైనది

## అతడు అద్భుతాలు చేస్తాడు.. టీమిండియాకు ఎంపిక చేయండి: గంగూలీ

భారత దేశవాళీ క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు. జమ్మూ అండ్ కాశ్మీర్ తమ 67 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ తొలి రంజీ ట్రోఫీ టైటిల్‌ను సొంతం చేసుకుంది. హుబ్లీ వేదికగా జరిగిన జరిగిన రంజీ ట్రోఫీ 2025-26 ఫైనల్‌లో కర్ణాటకను ఓడించి జమ్మూ కశ్మీర్ ఛాంపియన్‌గా అవతరించింది. ఈ చారిత్రత్మక విజయంలో ఆ జట్టు పేసర్ ఆకిబ్ నబీ ధార్‌ది కీలక పాత్ర. ఈ సీజన్ అసాంతం ఆకిబ్ నబీ అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. ఈ సీజన్‌లో మొత్తం 60 వికెట్లు పడగొట్టి టాప్ వికెట్ టేకర్ గా నిలిచాడు. రంజీ ట్రోఫీ చరిత్రలో ఒక పేసర్ 60 వికెట్ల మార్కును అందుకోవడం ఇది కేవలం మూడవసారి మాత్రమే. ఫైనల్ మ్యాచ్‌లో కూడా ఆకిబ్ దుమ్ములేపాడు. 29 ఏళ్ల నబీ తన స్వింగ్ బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. మొత్తంగా 5 వికెట్లు పడగొట్టి కర్ణాటక ఓటమిని శాసించాడు. కేఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్, కరుణ్ నాయర్ వంటి స్టార్ బ్యాటర్లను సైతం నబీ బోల్తా కొట్టించాడు. నబీ తన సంచలన ప్రదర్శనలతో టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీని సైతం ఆకర్షించాడు. రాబోయే ఇంగ్లండ్ పర్యటనకు ఆకిబ్ నబీని ఎంపిక చేయాలని గంగూలీ సెలెక్టర్లకు సూచించాడు. ఇంగ్లండ్ పిచ్‌లపై ఆకిబ్ స్వింగ్ బౌలింగ్ భారత్‌కు ఉపయోగపడుతుందని గంగూలీ అభిప్రాయపడ్డాడు. "ప్రయత్నం, దృడ సంకల్పం ఉంటే ఏం చేయగలరో జమ్మూ కశ్మీర్ ప్రపంచానికి చాటి చెప్పింది. జమ్మూ కశ్మీర్ చారిత్రత్మక విజయంతో ఆ ప్రాంతం మొత్తం గర్వించేలా చేశారు. కఠిన పరిస్థితులే ఛాంపియన్‌లను తాయారు చేస్తాయి. ఆకిబ్ నబీ నిజంగా ఒక అద్భుతం. నబీ ఇప్పుడు టీమిండియా జెర్సీ ధరించేందుకు సమయం అసన్నమైంది. ఈ ఏడాది వేసవిలో ఇంగ్లండ్‌తో జరిగే వైట్‌బాల్ సిరీస్‌కు నబీని ఎంపిక చేస్తే బాగుంటుంది" అని ఎక్స్‌లో దాదా రాసుకొచ్చాడు. కాగా బారముల్లాకు చెందిన నబీ.. ఐపీఎల్‌లో కూడా సత్తాచాటేందుకు సిద్ధమయ్యాడు.

# ధర్మవరం కేశవనగర్‌లో ఘనంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ

- పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న హరీష్ బాబు
- 13 ఏళ్ల కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో పెన్షన్
- మానవతా విలువలకు ప్రతీకగా మంత్రి సత్య కుమార్ యాదవ్ హరీష్ బాబు
- ఆదివారం సెలవు దినం కారణంగా ముందుగానే పెన్షన్ పంపిణీ చేపట్టడం జరిగిందన్న హరీష్ బాబు
- లబ్ధిదారుల యోగక్షేమాలు తెలుసుకున్న హరీష్ బాబు

**ధర్మవరం, ఫిబ్రవరి 28: బహుజన వేదిక న్యూస్** రాష్ట్రంలో ఒక రోజు ముందుగానే నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ధర్మవరం పట్టణంలోని 8వ వార్డు కేశవనగర్‌లో ఆదివారం పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మంత్రి సత్య కుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ డబ్బులు పంపిణీ చేశారు. మొదటగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ గారి ప్రత్యేక చొరవతో ధర్మవరం పట్టణం 8వ వార్డు కేశవనగర్‌కు చెందిన 13 ఏళ్ల కిడ్నీ వ్యాధిగ్రస్తుడు ఉదయ్ కుమార్‌కు మంజూరైన ₹10,000 పెన్షన్‌ను హరీష్ బాబు స్వయంగా అందజేశారు. తీవ్రమైన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి పరిస్థితిని తెలుసుకున్న మంత్రి సత్య కుమార్ యాదవ్ గారు మానవతా దృక్పథంతో వెంటనే స్పందించి పెన్షన్ మంజూరు చేయించడం స్థానికంగా ప్రశంసలు అందుకుంది. చిన్నారి వైద్య చికిత్సకు ఆర్థికంగా ఉపశమనం కలిగించే ఈ సహాయం కుటుంబానికి ఎంతో ధైర్యం ఇచ్చిందని బాలుడి తల్లిదండ్రులు తెలిపారు. మంత్రి గారి మానవత్వం, సున్నితమైన స్పందనకు వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేశవనగర్ ప్రాంతంలోని



ఇతర ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్ధిదారులకు పెన్షన్ డబ్బులు పంపిణీ చేసి, వారి ఆరోగ్య పరిస్థితులు, జీవన పరిస్థితులు గురించి హరీష్ బాబు ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి జరుగుతోందని ఆయన తెలిపారు. సెలవు దినం కారణంగా ముందస్తు పంపిణీ మార్చి 1 ఆదివారం సెలవు దినం కావడంతో, ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఒక రోజు ముందుగానే పెన్షన్ పంపిణీ



చేపట్టినట్లు హరీష్ బాబు వెల్లడించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా నిరంతరం కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది వెల్ఫేర్ అసిస్టెంట్ గోపి, ఎన్డీఏ కూటమి నాయకులు జూటూరు వెంకటేష్, చెన్నం శెట్టి రమేష్, నరేష్, మణికుమార్, లక్ష్మీనారాయణ అశ్వత్ నారాయణ అనిల్ కుమార్, పోతులయ్య తదితరులు పాల్గొన్నారు

# జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ని కలిసిన ఎమ్మెల్యే పరిటాల సునీత

మార్చి 4న సీఎంతో సమావేశం నేపథ్యంలో శ్రీరామ్ తో కలిసి కీలక భేటి

3మండలాల్లో సమస్యల్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే సునీత

హంద్రీనీవా-పీఏబిఆర్ కాల్వల అనుసంధానంపై పరిటాల శ్రీరామ్ వినతి

ఆత్మకూరు ఎస్సీ కాలనీలో స్మశాన వాటిక రోడ్డు గురించి ప్రత్యేకంగా విజ్ఞప్తి

**ఆత్మకూరు, పిబ్రవరి 28:బహుజన వేదిక న్యూస్** అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కలిశారు. మార్చి 4న ముఖ్యమంత్రి చంద్రబాబుతో అనంతపురం జిల్లా నేతల సమావేశం ఉన్న నేపథ్యంలో ఆమె కలెక్టర్ తో ప్రత్యేకంగా కలిశారు. రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు, రాప్తాడు, అనంతపురం రూరల్ మండలాల్లోని సమస్యల గురించి కలెక్టర్ కు వివరించారు. జిల్లాల వారిగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఎస్పీలతో కలిసి సమీక్ష నిర్వహిస్తున్న సందర్భంగా మూడు మండలాల సమస్యల గురించి చర్చించారు. అనంతపురం రూరల్ మండల కాలనీల పరిధిలో ప్రవహించే నడిమివంకకు రక్షణ గోడ నిర్మాణానికి రూ.40 కోట్లు, జల జీవన్ మిషన్ నిధులతో పీఏబిఆర్ నుంచి నిర్మిస్తున్న పైప్ లైన్ కు సంబంధించిన పెండింగ్ బిల్స్ క్లియరెన్స్ అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి పలు చెరువులకు నీరందించే అంశం గురించి కూడా చర్చించారు. ఆత్మకూరు మండలంలోని హంద్రీ నీవా ప్రధాన కాలువ నుంచి అదే మండలంలోని



పీఏబీఆర్ కుడి కాలువకు లింక్ కెనాల్ ఏర్పాటు చేసే అంశం గురించి సునీత, శ్రీరామ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ కాల్వల అనుసంధానం ద్వారా రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలలోని 50 చెరువులకు సాగు నీరు అందించే అవకాశం ఉందన్నారు. పండమేరు వాగు పై బ్రిడ్జి, రేమాండ్స్ సంస్థ ఏర్పాటును వేగవంతం చేయడం, పలు రోడ్ల నిర్మాణాలు, పండమేరు, పంపనూరు ఆలయాల వద్ద టూరిజం పార్కుల ఏర్పాటు గురించి చర్చించారు. వీటిన్నింటిపై ఇప్పటికే ముఖ్యమంత్రికి, సంబంధిత శాఖల మంత్రులకు వినతి పత్రాలు అందజేశామన్నారు. సీఎంతో భేటి అయిన సమయంలో మీ ద్వారా నివేదిక ఇవ్వాలని కోరారు. అలాగే ఇన్ ఛార్జి మంత్రి టీజీ భరత్ తో ఈ అంశాల గురించి మేము మాట్లాడామని తమరు కూడా చర్చించాలని కోరారు. అన్ని అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి.. నిధులు వచ్చేలా చూస్తామని కలెక్టర్ అన్నారు. మరోవైపు ఆత్మకూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ నుంచి స్మశానానికి వెళ్లే దారి పరిష్కారం, రోడ్డు నిర్మాణం గురించి ప్రత్యేకంగా వినతి పత్రం అందజేశారు. ఎవరైనా చనిపోతే.. మృతదేహాన్ని తీసుకెళ్లాలంటే. వర్షపు నీటిలో వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. అక్కడ సి.సి రోడ్డు, డ్రైన్ ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని కలెక్టర్ కు వివరించారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ ఓ.ఆనంద్ ఎమ్మెల్యే సునీతకు హామీ ఇచ్చారు

# లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ల పంపిణీ

**-: జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**

**-: అనంతపురం రూరల్ పరిధిలోని ఉప్పరపల్లిలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్లను పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్..**

**అనంతపురము, ఫిబ్రవరి 28 :బహుజన వేదిక న్యూస్** అనంతపురం రూరల్ పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పథకం కింద లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లను పంపిణీ చేసే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పాల్గొని స్వయంగా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో పెన్షన్ వల్ల ఉపయోగం ఉందా, ఒకటవతేదీ పెన్షన్ వస్తోందా, సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ ఇస్తున్నారా, మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా, తదితర వివరాలను ఆరా తీశారు. సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ ఇస్తున్నారని, పెన్షన్ డబ్బులు తమకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటవ తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లను పంపిణీ చేయడం జరుగుతోందని, మార్చి నెల ఒకటవతేదీ ఆదివారం కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక రోజు ముందుగానే 28వ తేదీనే పెన్షన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో సజావుగా పెన్షన్ల పంపిణీ చేపట్టడం జరుగుతోందని తెలిపారు. పెన్షన్ల పంపిణీ పూర్తి స్థాయిలో చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు పలు సమస్యలను తెలియజేయగా, వాటి



పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందులో జూటూరు పెద్దక్క అనే డయాలసిస్ లబ్ధిదారురాలికి పెన్షన్ కింద 10 వేల రూపాయలను, బండి రోగప్ప అని లబ్ధిదారుడికి వృద్ధాప్య పెన్షన్ 4,000, బండి లక్ష్మీదేవి అనే లబ్ధిదారురాలికి వితంతు పెన్షన్ కింద 4 వేల రూపాయలను, పి.సింహకు వికలాంగుల పెన్షన్ 6,000 రూపాయలు, జూటూరు కొండమ్మకి వితంతు పెన్షన్ 4 వేల రూపాయలను, కుమ్మర బాలాంజనేయులు అనే లబ్ధిదారుడికి వికలాంగ పెన్షన్ 6,000 రూపాయలు జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెన్షన్ అందజేయడం పట్ల లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మోహన్ కుమార్, ఎంపిడిఓ దివాకర్, గ్రామ సర్పంచ్ సావిత్రి, ఎంపీటీసీ నాగలక్ష్మమ్మ, ఆర్ఐ సందీప్, మండల సర్వేయర్ రఘు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గోన్నారు

## జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష

**సిద్దిపేట :** జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులతో పలు అంశాల గురించి పశువుల డాక్టర్ల తో జిల్లా కలెక్టర్ కె. హైమావతి జూమ్ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూరాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు.కేంద్ర ప్రభుత్వం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ మాంసం ఉత్పత్తి పెంచడమే కాకుండా తద్వారా ఉపాధి కోసం ఎదురుచూసే వారికి ఆదాయం పెంపొందించేందుకు రైతులకు గుర్తించాలని తెలిపారు. జిల్లాలో పశు సంపద ను ప్రతి రైతును కలిసి పశువులకు ఎన్ డి ఎల్ ఎం యాప్ లో ఆధార్ సీడింగ్ ప్రక్రియ రోజు వారిగా ఒక పూర్తి చెయ్యాలని తెలిపారు. 8వ విడత ఎఫ్ఎండి వాక్సినేషన్ మార్చి 2026 లో పూర్తి చెయ్యాలని తెలిపారు.పశు ఔషద విక్రయ కేంద్రాల ఏర్పాటు, పిఎఫ్ఎంఎస్ ఎఫ్ఎండి వ్యాక్సినేషన్ రెమ్యూనరేషన్ పబ్లిసిటీ ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్, ఇంటిగ్రేటెడ్ శాంపిల్ సర్వే స్కీం, నేషనల్ ఆర్టిఫిషియల్ ఇన్ సెమినేషన్ ప్రోగ్రాం మరియు సెక్స్ స్టోరేజ్ సిమెంట్ ప్రోగ్రామ్స్ లను సైతం పూర్తి చెయ్యాలని ఆదేశించారు.పశు వైద్యశాలలో డాక్టర్లు రైతులకు ఎల్లపుడు అందుబాటులో ఉండాలని పశువులకు మంచి వైద్యం, వ్యాక్సిన్లు వెయ్యాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కొండల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## స్వామిజి అనుమతితోనే ఆశ్రమం తరలింపు ఎంపి చామాల

**గాంధీ భవన్ :** హరీష్ రావుకు,బీజేపీ చీఫ్ రామచందర్ రావుకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లో 150 కోట్ల విలువైన కోకా పెట్ భూములు కేవలం ఒక్క రూపాయికే శారదా పీఠానికి భములు ఇచ్చారు. ప్రాధాన్యత కూడిన ప్రాంతాల్లో నచ్చిన వారికోసం భూములను పేలాల లాగ నాయకులు పంచారు. శారదా పీఠం భూమిని వాళ్ళ అనుమతి తో శంషాబాద్ తరలిస్తున్నారు. శారద పీఠం ఉన్న ఏరియాలో మంజీరా నీళ్ల తో ప్రజలకు మంచినీళ్లు అందించడానికి వాటర్ వర్క్స్ జరుగుతున్నవి. కోర్ అర్బన్ ఏరియాలో మెట్రో, మూసి ని అభివృద్ధి చేయడం ప్రజల కోసమే అని అన్నారు. ఎక్కడ అభివృద్ధి జరగొద్దని హరీష్ రావు కేటిఆర్ లు అడ్డు పడుతున్నారు. బావ, బామ్మర్ది హరీష్ రావు, కేటిఆర్ పొజిషన్ ఏందో తెలియదు. మేము అపొజిషన్ అంటున్నారు. మా ప్రభుత్వానికి కూడా భక్తి ,శ్రద్ధలు ఉన్నాయి. వేములవాడ, సమ్మక్క సారక్క దేవాలయాలను కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. రాష్ట్రంలో మంచి జరిగితే మళ్ళీ కాంగ్రెస్ కు పట్టం కడతారని హరీష్ రావు, కేటిఆర్ విష బీజాలు వేస్తున్నారని అన్నారు. మిలాగ కమిషన్ల కోసం కాళేశ్వరం కట్టలేదు. గుజరాత్ లో మోడీ సబర్మతి ని అభివృద్ధి చేసినట్లు తెలంగాణ లో మూసి అభివృద్ధి చేయొద్దా? సబర్మతి కి,మూసి కి సంబంధం లేదు అని రామచందర్ రావు అంటుండు. మూసి కి సబర్మతి కి ఎందుకు సంబంధం లేదని అన్నారు. గాంధీ నగర్ లో ఉన్న నది ఒడ్డున ఎన్ని ఇండ్లు తీశారు. మీరు అక్రమంగా తొలగించి వచ్చు కానీ ఇక్కడ చేయకూడదా? బీఆర్ఎస్ మాట్లాడిన గంట తర్వత బీజేపీ మాట్లాడుతుంది. డిల్లికి పోయి ఒక మాట గల్లీ లో ఒక మాట మాట్లాడితే ఎట్లా అని అయన ప్రశ్నించారు.


## భారీ మోసం కేసులో నిందితురాలు అరెస్టు

**మేడ్చల్ :** ఉప్పల్ పిఎస్ పరిధి రామంతాపూర్ చర్చి కాలనీకి చెందిన మరియమ్మ(50), అమాయక ప్రజలను ఆసరాగా చేసుకొని డబుల్ బెడ్ రూమ్స్, ప్రభుత్వ ప్లాట్లు, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని ఆశచూపి భారీ మోసం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసారు. డబుల్ బెడ్ రూమ్స్, ప్రభుత్వ ప్లాట్లు, ప్రభుత్వం ఉద్యోగం ఇప్పిస్తానని మరియమ్మ మాయమాటలు చెప్తూ సుమారు 80మంది వద్ద కోటి ఎనబై లక్షల రూపాయలు వసూలు చేసింది. రామంతాపూర్ చర్చి కాలనీ లో ఉంటున్న మరియమ్మ సమీపంలో ఉన్న చర్చికి వస్తూ వెళ్తూ ఉండేది. 2023 నుండి 2024 వరకు రోజు చర్చికి వస్తున్న మహిళలను టార్గెట్ గా చేసుకొని నా బంధువు కలెక్టర్ అని చెప్తూ, డబుల్ బెడ్ ఇండ్లు, ప్రభుత్వ ప్లాట్లు, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని సుమారు 80మంది వద్ద 1.8కోట్ల రూపాయలు కాజేసింది. ఫోన్ పే, క్యాష్ రూపంలో, ఆన్లైన్ రూపంలో డబ్బులు తీసుకుంది మరియమ్మ బాధితులకు ఏదో సాకు చూపుతూ కాలాన్ని గడిపేయడంతో మరియమ్మ మోసాన్ని బాధితులు గుర్తించారు. మరియమ్మ మాయమాటలతో మోసపోయామని బాధితులు ఉప్పల్ పోలీసులను ఆశ్రయించారు. మరియమ్మను ఉప్పల్ పోలీసులు అదుపులో తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నలందా ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ 45 ఏళ్ల వైభవోత్సవ వేడుకలు

**హైదరాబాద్:** నలందా ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ తమ 45వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంది. నాలుగు దశాబ్దాలకుపైగా విద్యా ప్రావీణ్యం, క్రమశిక్షణ మరియు సమగ్ర విద్యార్థి అభివృద్ధికి అంకితభావంతో సేవలందిస్తూ వస్తున్న ఈ సంస్థ, తన విశిష్ట ప్రయాణాన్ని గర్వంగా ఆచరించింది. 1980లో మంతెన సూర్యనారాయణ రాజు ఆధ్వర్యంలో స్థాపించబడిన నాలందా ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, శాశ్వత గుర్తింపుతో తన విద్యా సేవలను ప్రారంభించింది. విలువల ఆధారిత విద్యను లక్ష్యంగా చేసుకొని ప్రారంభమైన ఈ సంస్థ, నేడు సమాజానికి బాధ్యతాయుతమైన, ప్రతిభావంతులైన పౌరులను తీర్చిదిద్దే ప్రముఖ విద్యాసంస్థగా ఎదిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా భారత విదేశాంగ సేవల మాజీ అధికారి మరియు ప్రముఖ దౌత్యవేత్త దీపక్ వోహ్రా, , ఐక్యరాజ్యసమితితో అనుబంధం కలిగిన గ్లోబల్ వ్యూహకర్త మరియు దౌత్య నాయకురాలు సునీత వర్మ,, భారత సైన్యానికి చెందిన మేజర్ రామ్ విచ్చేసి విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ శ్రీనివాస రాజా మంతెన గామరియు డైరెక్టర్ సూర్య మంతెన నాయకత్వం వహించారు. వారు సంస్థ యొక్క లక్ష్యం అయిన సమగ్ర వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు మరియు ప్రపంచ స్థాయి దృష్టితో విద్యార్థులను తీర్చిదిద్దే కట్టుబాటును పునరుద్ఘాటించారు. విద్యా జ్యోతి ప్రదీపంతో కార్యక్రమం ప్రారంభమై, 45 ఏళ్ల జ్ఞానయాత్రకు ప్రతీకగా నిలిచింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం మరియు క్రమశిక్షణను ప్రతిబింబించాయి. ముఖ్య అతిథులు తమ ప్రసంగాల్లో నాలందా యొక్క విశిష్ట ప్రయాణాన్ని ప్రశంసిస్తూ, నైతిక నాయకత్వం, అంతర్జాతీయ అవగాహన మరియు నాణ్యమైన విద్య ద్వారా దేశ నిర్మాణం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. 46వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న నలందా ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, సృజనాత్మకత, విలువల ఆధారిత విద్య మరియు భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేసే శిక్షణతో ముందుకు సాగాలని సంకల్పించింది.

## 200 ఎకరాల సాగు ప్రశ్నార్థకం



**గంగాధర :** కాంగ్రెస్ పాలనలో ఎవుసం ఆగం అవుతున్నది. గంగాధర మండలంలో సాగు ప్రశ్నార్థకంగా మారుతున్నది. బీఆర్ఎస్ హయాంలో సీజన్‌కు ముందే కాలువలకు మరమ్మతులు చేయించి సకాలంలో నీటిని విడుదల చేసి నీరందించగా, రెండేండ్లుగా పరిస్థితి తారుమారైంది. గంగాధర మండలం మల్లాపూర్, గోపాల్‌రావుపల్లి గ్రామాల్లో ఏటా యాసంగిలో 200 ఎకరాలకు పైనే రైతులు వరి వేస్తుంటారు. కేసీఆర్ పాలనలో నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి క్రమం తప్పకుండా నీటిని విడుదల చేయడంతో ఏరందీ లేకుండా సేద్యం చేసుకున్నారు. నారాయణపూర్ నుంచి కొడిమ్యాల మండలం మైసమ్మ చెరువుకు నీటిని విడుదల చేసి, మళ్లీ అక్కడి నుంచి వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్ చెరువుకు వెళ్లే గ్రావిటీ కెనాల్‌కు ఏర్పాటు చేసిన డీ4 కెనాల్ ద్వారా మల్లాపూర్, గోపాల్‌రావుపల్లిలో చెరువులు, కుంటలు నింపి, నీరందించేవారు. కానీ, రెండేండ్లుగా సక్రమంగా నీరు విడుదల చేయకపోవడం, కెనాల్‌లో పూడికతీయకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయి. మరో నాలుగు రోజుల్లో పంటలకు నీరందకుంటే పూర్తిగా ఎండిపోయి పెట్టుబడి సైతం చేతికి రాని పరిస్థితులు కనిపిస్తున్నాయి.

# బిజినెస్

## మూడో త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధి 7.8 శాతం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి సంబంధించి దేశ జీడీపీ వృద్ధి రేటు 7.8 శాతంగా నమోదైనట్టు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కొత్త సిరీస్‌లో జీడీపీ డేటాను విడుదల చేసిన కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ, అక్టోబర్– డిసెంబర్ త్రైమాసికంలో నమోదైన వృద్ధి గతేడాది కాలంలో నమోదైన 7.4 శాతం కంటే ఎక్కువగానే ఉందని తెలిపింది. గతంలో జీడీపీ డేటాను 2011–12 బేస్ సంవత్సరంతో లెక్కించేవారు, తాజా గణాంకాలు 2022–23 ఆర్థిక సంవత్సరం ఆధారంగా గణిస్తారు. వృద్ధిని పాత వివరాలతో కాకుండా ఇటీవలి ఆర్థిక పరిస్థితులతో పోల్చారు. ఈ కొత్త సిరీస్‌లో జీఎస్?టీ పన్ను రికార్డులు, ఈవాహన్ డేటాతో పాటు ఇంటి పనులు చేసే మనుషుల గురించి, డ్రైవర్ల సేవలను కూడా చేర్చారు. దీనివల్ల ఆర్థిక పరమైన లెక్కలు మరింత ఖచ్చితంగా ఉంటాయని కేంద్రం భావిస్తోంది. ఈ మార్పులు దేశ ఆర్థిక వ్యవస్థ నిజంగా ఎలా పనిచేస్తుందో స్పష్టంగా, మరింత ఖచ్చితంగా తెలిసేందుకు సహాయపడ తాయి. అలాగే, కొత్త సిరీస్ కింద ప్రస్తుత పూర్తి ఆర్థిక సంవత్సరానికి దేశ జీడీపీ 7.6 శాతం వృద్ధి నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని మంత్రిత్వ శాఖ అంచనా వేసింది.





## కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు.. భారీ నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

అంతర్జాతీయ పరిస్థితులు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరు స్టాక్ మార్కెట్ల పై తీవ్రంగా చూపింది. ఈ రోజు ఉదయం నుంచి ప్రతికూల వాతావరణం ఎదుర్కొన్న భారతీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ సుమారు 900 పాయింట్లు, నిఫ్టీ 300 పాయింట్ల మేర పతనం కావడానికి ఈ అంతర్జాతీయ పరిణామాలు కారణమయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కొత్త టారిఫ్ విధింపుల హెచ్చరికలు, అమెరికా–ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇన్వెస్టర్లలో ఆందోళన కలిగించాయి. దీనికి తోడు, ముడి చమురు ధరలు బ్యారెల్కు 72 డాలర్లకు చేరడం, అమెరికా డాలర్ బలపడటం వంటి అంశాలు భారత రూపాయి పై ఒత్తిడి పెంచి, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఈఎఐ) నిధులను వెనక్కి తీసుకోవడానికి దారితీశాయి. అలాగే ఐటీ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) వల్ల తలెత్తే అంతరాయాలపై భయాలు ఇన్వెస్టర్లను కలవరపెట్టాయి. ఆంత్రోపిక్ వంటి కంపెనీలు కొత్త ఏఐ టూల్స్ విడుదల చేయడంతో, సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగ కోతలపై ఆందోళన మొదలైంది. ఇది కాకుండా, క్యూ3 (ఖ3) జీడీపీ గణాంకాలు వెలువడనున్న నేపథ్యంలో దేశీయంగా కూడా కొంత అస్థిరత చోటుచేసుకుంది. బ్యాంకింగ్, ఆటో, ఎఫ్ఎంసీజీ రంగాల్లో భారీగా లాభాల స్వీకరణ జరగడం వల్ల మార్కెట్లు కోలుకోలేకపోయాయి.




# ఇన్వెస్టర్ల హాట్ ఫేవరేట్‌గా మారిన తేజస్ నెట్వర్క్




టాటా గ్రూప్‌కు చెందిన టెలికాం ఎక్విప్‌మెంట్ తయారీ సంస్థ తేజస్ నెట్‌వర్క్ షేర్లు ప్రస్తుత స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్టర్ల హాట్ ఫేవరెట్‌గా నిలిచాయి. ప్రస్తుతం ఇండియా వేగంగా డిజిటల్ విప్లవం దిశగా అడుగులు వేస్తుండగా.. స్వదేశీ టెక్నాలజీ ఉత్పత్తులకు డిమాండ్ భారీగా పెరిగింది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మేక్ ఇన్ ఇండియా', 'పీఎల్ఐ' పథకాల ద్వారా దేశీయంగా టెలికాం పరికరాలను తయారు చేసే కంపెనీలకు విపరీతమైన ప్రోత్సాహం లభిస్తోంది. ఈ నేపథ్యంలో, తేజస్ నెట్‌వర్క్ తన వ్యాపార సామర్థ్యాన్ని మెరుగుపరుచుకుంటూ, భారీ ఆర్డర్లను దక్కించుకోవడంలో సక్సెస్ సాధించింది. ఫలితంగా మార్కెట్ ఒడిదుడుకుల్లో ఉన్నప్పటికీ ఈ షేర్ వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపుతున్నారు. ఈ కంపెనీ షేర్ ధర పెరగడానికి ప్రధాన కారణం 5ఉ నెట్‌వర్క్ విస్తరణ. దేశవ్యాప్తంగా 5ఉ సేవలను వేగవంతం చేసే క్రమంలో బీఎస్ఎన్ఎల్ (ఞాఔఇ) వంటి ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేట్ టెలికాం ఆపరేటర్ల నుండి కూడా తేజస్ నెట్‌వర్క్‌కు భారీ ఆర్డర్లు అందుతున్నాయి. టాటా సన్స్ ఈ కంపెనీలో ప్రధాన వాటాదారుగా ఉండటం వల్ల, మేనేజ్‌మెంట్ పరంగా, ఆర్థికంగా ఈ సంస్థకు గట్టి భరోసా లభిస్తోంది. కేవలం దేశీయ మార్కెట్ మాత్రమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆప్టికల్ నెట్‌వర్కింగ్, వైర్‌లెస్ ఉత్పత్తులకు ఉన్న డిమాండ్‌ను తేజస్ నెట్‌వర్క్ అందిపుచ్చుకుంటోంది. రాబోయే కాలంలో డేటా వినియోగం మరింత పెరగనుండటం, గ్రామ గ్రామానికి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలనే లక్ష్యాలు ఈ కంపెనీ వృద్ధికి ఇంధనంలా మారుతున్నాయి. కాగా ఆర్థిక విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. స్టాక్ మార్కెట్‌లో స్వల్పకాలికంగా ధరల హెచ్చుతగ్గులు సహజమైనప్పటికీ, దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు తేజస్ నెట్‌వర్క్ ఒక మంచి అవకాశం అని చెబుతున్నారు. కంపెనీ యొక్క ఆర్డర్ బుక్ బలంగా ఉండటం, టాటా గ్రూప్ మద్దతు, భవిష్యత్తు టెక్నాలజీపై చేస్తున్న పరిశోధనలు ఈ షేర్‌ను రేసులో ముందుంచుతున్నాయి. టెలికాం రంగంలో చైనా ఉత్పత్తులపై ఆధారపడటాన్ని తగ్గించాలనే ప్రపంచ దేశాల నిర్ణయం కూడా తేజస్ నెట్‌వర్క్ వంటి సంస్థలకు అంతర్జాతీయంగా కొత్త ద్వారాలను తెరుస్తోంది.

# బొగ్గు దిగుమతులు 30% తగ్గించుకోండి

బొగ్గు దిగుమతులను కనీసం 30% తగ్గించుకోవాలని విద్యుత్‌ప్లాంట్లకు కేంద్రం సూచించింది. దేశీయ బొగ్గు కలిపి వాడడాన్ని (బ్లెండింగ్) పెంచడం ద్వారా, ఈ ఏడాది కనీసం 15 మిలియన్ టన్నుల బొగ్గు దిగుమతిని నిలువరించవచ్చని భావిస్తోంది. ఈ ప్రణాళికతో దగ్గరి సంబంధాలున్న ప్రభుత్వ, పరిశ్రమ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద థర్మల్ బొగ్గు దిగుమతిదారుగా మనదేశం ఉంది. 2025లో ఇండొనేషియా, దక్షిణాఫ్రికా, రష్యా వంటి దేశాల నుంచి వచ్చిన 50 మిలియన్ టన్నుల బొగ్గును మనదేశంలోని విద్యుత్ ప్లాంట్లు వినియోగించాయి. ఈ ఏడాది 15 మి. టన్నుల మేర బొగ్గు దిగుమతుల్లో కోత వేయాలని కేంద్రం భావిస్తోందని తెలుస్తోంది. దేశంలో నాలుగింట మూడొంతుల విద్యుదుత్పత్తికి బొగ్గుపైనే జరుగుతోంది. దేశీయంగా నాణ్యమైన బొగ్గు లభిస్తున్నందున, ఇబ్బందులేమీ ఉండవని విద్యుత్తు ప్లాంట్లకు ప్రభుత్వం వివరిస్తున్నట్లు సమాచారం.

వేసవి కోసం బొగ్గు సరఫరా పెంపు..కోల్ ఇండియా: వేసవిలో విద్యుత్ వాడకం పెరుగుతుంది కాబట్టి, అదనపు విద్యుత్తు ఉత్పత్తి చేసేలా ప్లాంట్లకు బొగ్గు సరఫరా పెంచే పనిలో ఉన్నట్లు కోల్ ఇండియా తెలిపింది. ఈనెల 25 నాటికి కంపెనీ వద్ద 115 మిలియన్ టన్నుల బొగ్గు ఉంది. మార్చి 31 నాటికి ఇది మరింత పెరగనుంది. విద్యుత్ ప్లాంట్ల వద్ద 55 మి. టన్నుల బొగ్గు సహా ఇతరత్రా గూడ్స్ షెడ్లు, వాషరీలు, పోర్టులతో కలిపి మొత్తం 175.5 మి.టన్నుల నిల్వలున్నాయి.



విద్యుత్ ప్లాంట్లకు వేసవి నెలల్లో అధిక పరిమాణంలో బొగ్గు అవసరం ఉంటుంది.

# స్పోర్ట్స్

# భారత్‌పై సెంచరీల మోత.. మిచెల్‌కు ఐసీసీ ప్రతిష్టాత్మక అవార్డు

న్యూజిలాండ్ స్టార్ ఆల్‌రౌండర్ డారిల్ మిచెల్‌కు ఐసీసీ ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. జనవరి 2026 నెలకు గాను 'ఐసీసీ మెన్స్ ప్లేయర్ ఆఫ్ ది మంత్'గా మిచెల్ ఎంపికయ్యాడు. గత నెలలో భారత్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో మిచెల్ దుమ్మురేపాడు. కివీస్ జట్టు 2–1తో సిరీస్ గెలవడంలో డారిల్ కీలక పాత్ర పోషించాడు. ఈ మూడు వన్డేల సిరీస్‌లో అతడు ఏకంగా 352 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు ఉండడం గమనార్హం. ఈ అద్భుత ప్రదర్శన ఫలితంగానే అతడికి ఈ ఐసీసీ ప్రతిష్టాత్మక అవార్డు దక్కింది. భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఇంగ్లండ్ వెటరన్ జో రూట్ వంటి దిగ్గజాలను వెనక్కి నెట్టి ఈ అవార్డును మిచెల్ సొంతం చేసుకున్నాడు. ఇక బంగ్లాదేశ్‌కు చెందిన శోభన మోస్తరీ మహిళల విభాగంలో ఈ అవార్డును దక్కించుకుంది. టీ20 వరల్డ్ కప్ క్వాలిఫైయర్స్‌లో శోభన అసాధారణ ప్రదర్శన కనబరిచింది. టీ20 వరల్డ్‌కప్–2026కు బంగ్లా క్వాలిఫై కావడంలో ఆమెది కీలక పాత్ర.



## అతడు అద్భుతాలు చేస్తాడు.. టీమిండియాకు ఎంపిక చేయండి: గంగూలీ



భారత దేశవాళీ క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు. జమ్మూ అండ్ కాశ్మీర్ తమ 67 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ తొలి రంజీ ట్రోఫీ టైటిల్‌ను సొంతం చేసుకుంది. హుబ్లీ వేదికగా జరిగిన జరిగిన రంజీ ట్రోఫీ 2025–26 ఫైనల్‌లో కర్ణాటకను ఓడించి జమ్మూ కశ్మీర్ ఛాంపియన్‌గా అవతరించింది. ఈ చారిత్రత్మక విజయంలో ఆ జట్టు పేసర్ ఆకిబ్ నబీ ధార్‌ది కీలక పాత్ర. ఈ సీజన్ అసాంతం ఆకిబ్ నబీ అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. ఈ సీజన్‌లో మొత్తం 60 వికెట్లు పడగొట్టి టాప్ వికెట్ టేకర్ గా నిలిచాడు. రంజీ ట్రోఫీ చరిత్రలో ఒక పేసర్ 60 వికెట్ల మార్కును అందుకోవడం ఇది కేవలం మూడవసారి మాత్రమే. ఫైనల్ మ్యాచ్‌లో కూడా ఆకిబ్ దుమ్మురేపాడు. 29 ఏళ్ల నబీ తన స్వింగ్ బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. మొత్తంగా 5 వికెట్లు పడగొట్టి కర్ణాటక ఓటమిని శాసించాడు. కేఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్, కరుణ్ నాయర్ వంటి స్టార్ బ్యాటర్లను సైతం నబీ బోల్తా కొట్టించాడు. నబీ తన సంచలన ప్రదర్శనలతో టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీని సైతం ఆకర్షించాడు. రాబోయే ఇంగ్లండ్ పర్యటనకు ఆకిబ్ నబీని ఎంపిక చేయాలని గంగూలీ సెలెక్టర్లకు సూచించాడు. ఇంగ్లండ్ పిచ్‌లపై ఆకిబ్ స్వింగ్ బౌలింగ్ భారత్‌కు ఉపయోగపడుతుందని గంగూలీ అభిప్రాయపడ్డాడు. "ప్రయత్నం, దృఢ సంకల్పం ఉంటే ఏం చేయగలరో జమ్మూ కశ్మీర్ ప్రపంచానికి చాటి చెప్పింది. జమ్మూ కశ్మీర్ చారిత్రత్మక విజయంతో ఆ ప్రాంతం మొత్తం గర్వించేలా చేశారు. కఠిన పరిస్థితులే ఛాంపియన్‌లను తాయారు చేస్తాయి. ఆకిబ్ నబీ నిజంగా ఒక అద్భుతం. నబీ ఇప్పుడు టీమిండియా జెర్సీ ధరించేందుకు సమయం అసన్నమైంది. ఈ ఏడాది వేసవిలో ఇంగ్లండ్‌తో జరిగే వైట్‌బాల్ సిరీస్‌కు నబీని ఎంపిక చేస్తే బాగుంటుంది" అని ఎక్స్‌లో దాదా రాసుకొచ్చాడు. కాగా బారముల్లాకు చెందిన నబీ.. ఐపీఎల్‌లో కూడా సత్తాచాటేందుకు సిద్ధమయ్యాడు. గత డిసెంబర్‌లో జరిగిన వేలంలో రూ. 8.4 కోట్ల భారీ ధరకు ఆకిబ్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ సొంతం చేసుకుంది.

## చరిత్ర సృష్టించిన జమ్మూకశ్మీర్.. తొలిసారి రంజీ ట్రోఫీ కైవసం

హుబ్లీ: జమ్మూకశ్మీర్ క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. రంజీ ట్రోఫీని మొట్ట మొదటి సారి గెలుచుకున్నది. కర్నాటకతో హుబ్లీలో జరిగిన ఫైనల్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. దీంతో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని సాధించిన జమ్మూకశ్మీర్ జట్టుకు రంజీ ట్రోఫీ దక్కింది. ఇవాళ అయిదో రోజు జమ్మూకశ్మీర్ బ్యాటర్లు కర్నాటక బౌలర్లను ధీటుగా ఎదుర్కొన్నారు. జేకే బ్యాటర్లు కమ్రాన్ ఇక్బాల్, సాహిల్ లోత్రాలు.. కర్నాటక బౌలర్లను ఆటాడుకున్నారు. ఆ ఇద్దరూ అయిదో వికెట్ అజేయంగా 197 రన్స్ జోడించారు. కమ్రాన్ ఇక్బాల్ 160 , సాహిల్ లోత్రా 101 రన్స్ చేసి క్రీజ్‌లో ఉన్నారు. రెండో ఇన్సింగ్‌లో ఇవాళ జమ్మూకశ్మీర్ జట్టు 4 వికెట్లు కోల్పోయి 342 రన్స్ చేసిన సమయంలో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. జేకే జట్టు మొత్తం 633 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. అయితే కర్నాటక, జమ్మూకశ్మీర్ కెప్టెన్లు డ్రాకు అంగీకరించడంతో.. రంజీ ట్రోఫీ జేకే జట్టును వరించింది.











# టాలీవుడ్‌కి డ్రై మంత్‌గా ఫిబ్రవరి.. 10 రిలీజ్‌లు, క్లీన్ హిట్ ఒక్కటీ లేదు!


సంక్రాంతి సీజన్‌లో కళకళలాడిన టాలీవుడ్ బాక్సాఫీస్‌కు ఫిబ్రవరి నెల మాత్రం తీవ్ర నిరాశ మిగిల్చింది. మొత్తం పది సినిమాలు థియేటర్లలోకి వచ్చినప్పటికీ, కమర్షియల్‌గా భారీ లాభాలు తెచ్చిపెట్టిన క్లీన్ హిట్ ఒక్కటి కూడా లేకపోవడం ట్రేడ్ వర్గాలను కలవరపెడుతోంది. ఈ నెలలో రిలీజైన సినిమాల్లో సంతోష్ శోభన్ నటించిన కపుల్ ఫ్రెండ్లీ మాత్రమే ఓ మోస్తరు ఫలితాన్ని సాధించింది. సినిమాకు పాజిటివ్ టాక్ వచ్చినప్పటికీ, ఆ స్థాయిలో భారీ కలెక్షన్స్ రాలేదు. అయినా పెట్టుబడికి తగ్గ రికవరీ సాధించడంతో కమర్షియల్‌గా "సేఫ్ జోన్"లో నిలిచిందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే భారీ అంచనాలతో వచ్చిన గుణశేఖర్ తెరకెక్కించిన యూఫోరియా, అలాగే విశ్వక్ సేన్ ఫంకీ చిత్రాలు ప్రేక్షకులను మెప్పించలేక బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. కంటెంట్ పరంగా బలహీనతలు ఈ సినిమాలకు పెద్ద మైనస్ అయ్యాయి. ఇక వరుస సినిమాలతో బిజీగా ఉన్న సుహాస్‌కి హే బల్వంత్ నిరాశే మిగిల్చింది. యావరేజ్ టాక్ కూడా రాకపోవడంతో ఈ సినిమా కూడా ఫెయిల్యూర్ జాబితాలో చేరింది. సరైన కమర్షియల్ సక్సెస్ ఇంకా సుహాస్‌కు అందని ద్రాక్ష పండుగానే మిగిలిపోయిందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఇక మిగతా కొన్ని సినిమాలు ప్రేక్షకులకు రిజిస్టర్ కూడా కాలేదు.. శివ కందుకూరి 'నవాబ్ కేఫ్', సాయి సింహాద్రి 'సన్ ఆఫ్', అలాగే 'సీతా పయనం', 'విత్ లవ్', 'శ్రీ చిదంబరం గారు' లాంటి సినిమాలు కనీస బజ్ లేకుండా రిలీజ్ అయ్యి, అంతే సైలెంట్ గా మొదటి వీకెండ్‌కే థియేటర్ల నుంచి సైలెంట్‌గా తప్పుకున్నాయి. నెలాఖరులో ఫిబ్రవరి 27న రిలీజైన శ్రీ విష్ణు విన్యాసం పైనే ఇప్పుడు ఇండస్ట్రీ ఆశలు పెట్టుకుంది. శ్రీవిష్ణు మార్క్ కామెడీ వర్కౌట్ అవుతుందని భావించినప్పటికీ, ఫస్ట్ డే మిక్స్ టాక్ వచ్చింది. మొదటి రోజు కలెక్షన్స్ ఓ మోస్తరుగా ఉన్నా, అసలు ఫలితం మాత్రం వీకెండ్ వసూళ్లపైనే ఆధారపడి ఉంది. అయితే ఏపీ, తెలంగాణ ప్రేక్షకుల పల్స్ పూర్తిగా మారిపోయిందని ఈ నెల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. సంక్రాంతి లాంటి పెద్ద సీజన్ తర్వాత వచ్చిన రెగ్యులర్ సినిమాల కోసం థియేటర్లకు రావడంలో ప్రేక్షకులు ఆసక్తి చూపడం లేదు. "ఓటీటీలో చూసుకుందాం" అన్న మైండ్‌సెట్ బలపడుతోంది. థియేటర్లలో కలెక్షన్స్ తగ్గిపోవడంతో నైజాం, ఆంధ్రా ప్రాంతాల్లో ఎగ్జిబిటర్లు కూడా నష్టాలు చవిచూశారు. అందుకే వాలెంటైన్స్ వీక్‌లో రామ్ చరణ్ నటించిన ఆరెంజ్, అలాగే ఏ మాయ చేశావే వంటి రీ-రిలీజ్ చిత్రాలపై ఆధారపడాల్సి వచ్చింది. మొత్తానికి, పది సినిమాలు రిలీజ్ అయినా టాలీవుడ్‌కు ఫిబ్రవరి పూర్తిగా డ్రై మంత్‌గా మిగిలిపోయింది. ఇప్పుడు ట్రేడ్ వర్గాల చూపు 'విష్ణు విన్యాసం' వీకెండ్ పెర్ఫార్మెన్స్‌పై, అలాగే వేసవి సెలవులను టార్గెట్ చేస్తూ మార్చి-ఏప్రిల్‌లో రాబోయే భారీ లైనప్‌పైనే ఉంది. సమ్మర్ సీజన్ టాలీవుడ్‌కు ఊపిరి పోస్తుందా? అన్నది చూడాలి.

# శ్రీనిధి శెట్టి బ్యూటిఫుల్ ఫొటోస్

భారతదేశానికి చెందిన సినిమా నటి. ఆమె మొదట మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టి 2015లో మిస్ కర్ణాటక, మిస్ బ్యూటీఫుల్ స్మైల్, 2016లో మిస్ సుప్రనేషనల్ ఇండియా టైటిల్స్‌ను గెలుచుకొని ...అందం, అభినయం ఉన్నా అదృష్టం కలిసి రాని హీరోయిన్లలో కేజీఎఫ్ హీరోయిన్ శ్రీనిధి శెట్టి ఒకరు. నాని తో కలిసి హిట్ 3, సిద్ధూ జొన్నలగడ్డ తో తెలుసు కదా వంటి లు చేసినప్పటికీ ఈ ముద్దుగుమ్మకు అవకాశాలు రావడం లేదు.కేజీఎఫ్, కేజీఎఫ్ 2 లతో పాన్ ఇండియా ఫేమస్ అయిపోయింది కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టి. ఇందులో ఆమె అందం, అభినయానికి కుర్రకారు ఫిదా అయిపోయారు.అయితే వీటి తర్వాత శ్రీనిధి నటించిన కోబ్రా పెద్దగా ఆడలేదు. విక్రమ్ హీరోగా తెరకెక్కిన ఈ జస్ట్ యావరేజ్ రిజల్ట్ తో సరిపెట్టుకుంది.అయితే న్యాచురల్ స్టార్ నానితో కలిసి శ్రీనిధి శెట్టి నటించిన హిట్ 3 బ్లాక్ బస్టర్ గా నిలిచింది. బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ. 100 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది.దీని తర్వాత స్టార్ బాయ్ సిద్ధూ జొన్నలగడ్డతో కలిసి తెలుసు కదా అనే లో హీరోయిన్ గా నటించింది శ్రీనిధి శెట్టి.అయితే ఈ కేవలం యావరేజ్ గా మాత్రమే ఆడింది.ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ విక్టరీ వెంకటేష్ నటిస్తోన్న ఆదర్శ కుటుంబం అనే లో హీరోయిన్ గా నటిస్తోంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ ను తెరకెక్కిస్తున్నాడు.సోషల్ మీడియాలో యాక్టివ్ ఉండే శ్రీనిధి శెట్టి లేటెస్ట్ గా కొన్ని బ్యూటిఫుల్ ఫొటోస్ షేర్ చేసింది. ఇందులో చీర కట్టుతో మేకప్ లేకుండా సింపుల్ లుక్‌తో కట్టి పడేసిందీ అందాల తార.



# పవర్‌ఫుల్ పాత్రలో వివేక్ ఒబెరాయ్



ప్రభాస్, డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబోలో రూపొందుతున్న పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ 'స్పిరిట్'. ఈ చిత్రంలో పవర్ ఫుల్ పాత్రతో వివేక్ ఒబెరాయ్ కనిపించబోతున్నట్లు మేకర్స్ తెలిపారు.ఈ నేపథ్యంలో విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌లో ఒబెరాయ్ కమాండింగ్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో, ఇంటెన్స్‌గా కనిపిస్తూ హై-స్టేక్స్ యూనివర్స్‌లో తన పాత్ర ఎంత ప్రభావవంతంగా ఉండబోతుందో చూపించారు. విభిన్న పాత్రలతో తనదైన ముద్ర వేసుకున్న ఆయన రాకతో కథలో కొత్త డైనమిక్ చేరింది.ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో ఐశ్వర్య దేశాయ్‌ను పరిచయం చేశారు మేకర్స్. ఆమె పాత్ర కథలో చాలా కీలకంగా ఉండనుంది. 'యానిమల్' సంచలన విజయం తర్వాత నిర్మాత భూషణ్ కుమార్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మరోసారి బోల్డ్ క్రియేటివ్ విజన్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.ప్రభాస్‌కు జోడిగా తృప్తి డిమ్రి కనిపించనున్నారు. భారీ స్థాయిలో, అద్భుతమైన ఎమోషన్స్‌తో ఈ చిత్రం ప్రేక్షకులకు ఓ ఇంటెన్స్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని అందించనుంది. 8 భాషల్లో విడుదల కానున్న ఈ పాన్-వరల్డ్ ఎంటర్‌టైనర్‌ను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను సమానంగా ఆకట్టుకునేలా రూపొందిస్తున్నారు. గుల్షన్ కుమార్ సమర్పణలో, టి-సిరీస్ ఫిలిమ్స్, భద్రకాళి పిక్చర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# సందీప్‌తో మిరాయ్ బ్యూటీ!

'అశోకవనంలో అర్జున కల్యాణం' మూవీతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన రితికా నాయక్.. హాయ్ నాన్న మూవీలో క్లైమాక్స్‌లో ఎంట్రీ ఇచ్చి ఆకట్టుకుంది.ఇక ఆ తర్వాత మిరాయ్‌తో ఒక్కసారిగా క్రేజీ బ్యూటీగా మారిపోయింది. అందం, అభినయంతో కుర్రాళ్లను సైతం ఆకట్టుకుని బిగ్ సక్సెస్ అందుకుంది. ప్రజెంట్ ఈ అమ్మడు వరుస ఆఫర్లు అందుకుంటుంది. ప్రస్తుతం డ్యూయెట్, కొరియన్ కనకరాజు మూవీస్‌లో నటిస్తున్నారు. ఇప్పుడు మరో ఆఫర్ అందుకుంది రితికా. టాలీవుడ్, కోలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులు చేస్తున్న టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్.. ఈ ఏడాది పొలిటికల్ యాక్షన్ డ్రామా 'పవర్ పేట'తో రాబోతున్నాడు. ఈ మూవీలో సందీప్ సరసన 'మిరాయ్' బ్యూటీ రితికా నాయక్ హీరోయిన్‌గా ఫిక్స్ చేసినట్లు టాక్. దీనికి రౌడీ ఫెలో, చల్ మోహన్‌రంగ్ మూవీస్ ఫేం కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తుండగా... 70 ఎంఎం ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ రావాల్సి ఉంది.





# ఈ విజయం గర్వంగా ఉంది

యష్ రాజ్ ఫిలిమ్స్ నిర్మించిన 'మర్దానీ 3' బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించింది. మర్దానీ ఫ్రాంచైజీలో భాగంగా వచ్చిన ఈ మూడో పార్ట్ భారీ కలెక్షన్లను నమోదు చేసింది.మర్దానీ 3 ఇప్పటికే మర్దానీ ఫ్రాంచైజీలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఇది ఇండియన్ బాక్సాఫీస్ వద్ద 50 కోట్లు, ప్రపంచవ్యాప్తంగా 75 కోట్లు క్రాస్ చేసి ఓ మైలు రాయిగా రాణి ముఖర్జీ కెరీర్‌లో నిలిచిపోయింది. ఈ మేరకు రాణి ముఖర్జీ తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ .. "మర్దానీ 3'ని ఇంత పెద్ద సక్సెస్ చేసిన ప్రేక్షకులకు థాంక్స్. నేను వారికి ఎప్పుడూ కృతజ్ఞురాలిని. 'ఆల్ఫా మేల్' పాత్రలతో తీసిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతున్న ఈ సమయంలో 'మర్దానీ 3' ఇలాంటి విజయాన్ని సాధించడం గర్వంగా ఉంది. ఇలాంటి సమయంలో ఈ విజయం ఇంకా ఫీమేల్ సెంట్రిక్ సినిమాలకు ఆదరణ ఉందనే శక్తివంతమైన విషయాన్ని రుజువు చేస్తుంది. చిత్ర పరిశ్రమ ఈ విషయాన్ని గమనించిందని, అందుకే ఇలాంటి మరిన్ని ఫీమేల్ సెంట్రిక్ సినిమాలు వస్తాయని నేను ఆశిస్తున్నాను' అన్నారు.

Publisher, printer and Owner P. Ramanjaneya Prasad, Government Hospital back SIDE Singanamala (Mandal) Ananthapuram (District)- AP, Printing at LAKSHMI OFFSET Printers, D.NO: 12-3-195, 5th cross SAINAGAR Beside Veterinary Hospital Ananthapuram, Published at P. Ramanjaneya Prasad Government Hospital Back Side Singanamala (Mandal) Ananthapuram (District)- RNI Reg NO: APTEL/2024/86898 ,AP, Editor P.Ramanjaneya Prasad ph:9494900294